

విస్ఫోటనంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఓదారుస్తున్న బంధువు



కళ్లెదుట ఎగసిపడుతున్న మంటలు.. ఎటు చూసినా కాలిపోయి నిర్జీవంగా పడి ఉన్న మృతదేహాలు.. మరోవైపు సగం కాలిన క్షతగాత్రుల ఆర్తనాదాలు.. ఇంకోవైపు బాధిత కుటుంబీకుల ఏడుపులు.. చెల్లాచెదురుగా కాలి బూడిదైన బాణసంచా.. ఎటు చూసినా భీతావహ దృశ్యాలు... ఇదీ రాయవరంలో బుధవారం జరిగిన మహా విషాదం.. బాణసంచా తయారీకేంద్రంలో మంటలు ఎగసిపడి ఏడుగురు మృత్యువాతపడ్డారు.. మరో ముగ్గురు ఒళ్లంతా కాలిన గాయాలతో క్షతగాత్రులుగా మారిపోయారు. ఉదయం వెళ్లొస్తాం అంటూ ఇంటి నుంచి పనికి వెళ్లినవాళ్లు అటు నుంచే తరలిరాని లోకాలకు వెళ్లిపోయారు.. చివరి చూపు కూడా దక్కనంతగా మృతదేహాలు కాలిపోయాయి.. అవి చూసిన కుటుంబీకుల కన్నీళ్లు మిన్నంటాయి.. వెళ్లొస్తాం అన్నారు.. ఇలా చేశారేంటి.. ఇక మాకు దిక్కెవరంటూ మృతదేహాలను చూస్తూ బోరున విలపిస్తున్నారు.. క్షతగాత్రుల బంధువుల మా వాళ్లను కాపాడండంటూ వైద్యులను వేడుకుంటున్నారు.

మహా.. విషాదం



బాణసంచా తయారీకేంద్రంలో అగ్నికీలలు..
చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు..

కన్నీళ్లు పెట్టుకుంటున్న కేంద్రం యజమాని కుమారుడు చిట్టిబాబు

బాణసంచా పేలుడు.. ఏడుగురు సజీవదహనం

అమలాపురం/మండపేట/రాయవరం, అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెలుగులు విరజిమ్మాల్సిన బాణసంచా.. కొందరి కుటుంబాల్లో చీకటిని నింపింది. బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ఘోర విస్ఫోటనంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. వారిలో నలుగురు మహిళలు, బాణసంచా కర్మాగారానికి చెందిన యజమాని ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం-కొమరపాలెం ప్రధాన రహదారిని ఆనుకుని రాయవరం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ ఈ విస్ఫోటనం సంభవించినట్టు సమాచారం. ఈ విస్ఫోటనం సమీప ప్రాంతాల్లోని ఇళ్లల్లో సైతం ప్రకంపనలు సృష్టించింది. బాణసంచా కర్మాగారం నుంచి భారీగా శబ్దాలతో పాటు దట్టమైన పొగలు ఆకాశాన్నంటాయి. దాంతో స్థానికులంతా భయభ్రాంతులకు గురయ్యారు.

అంతటా ఆర్తనాదాలే...

శ్రీలక్ష్మీ గణపతి బాణసంచా గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో రోజుకు 40 మంది వరకు పనిచేస్తారు. ఈ సంస్థ 93 ఏళ్ల నుంచి బాణసంచా తయారీలో పేరొందింది. ప్రతి ఏడాది దీపావళికి పెద్ద ఎత్తున బాణసంచా తయారుచేస్తారు. ఈ ఏడాది అదే విధంగా భారీఎత్తున బాణసంచా తయారీ చేస్తుండగా బుధవారం భారీ పేలుడు సంభవించింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. భోజన సమయంలో పది మంది బయటకువెళ్లగా, మరో 10 మంది తయారీ కేంద్రంలో యజమానితో సహా ఉన్నారు. భారీ పేలుడు, మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో మందుగుండు తయారీ చేసే కేంద్రం పైకప్పుకూలిపోయింది. ఈ పేలుడు ధాటికి మందుగుండు సామగ్రి స్టాక్ పాయింట్ కూడా నేలకూలింది. కూలీలను రక్షించే ప్రయత్నంలో యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి అలియాస్ సత్తిబాబు మంటల్లో చిక్కుకుని కూలీలతో సహా సజీవదహనం అయ్యాడని చెబుతున్నారు. మృతుడు చేతికి ఉన్న ఉంగరాన్ని బట్టి మృతదేహాన్ని సత్తిబాబుగా గుర్తించారు. సంఘటనా స్థలంలో నేల కూలిన షెడ్డు, చెల్లాచెదురుగా మృతదేహాలు పడి ఉన్నాయి. సంఘటనా జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సంస్థ యజమాని సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిబంధనలు పాటించే సత్తిబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బాణసంచా తయారీ కేంద్రాల గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.ఇదే వృత్తిలో కొనసాగుతూ మందుగుండుకు బలికావడంతో సత్తిబాబు కుటుంబీకులు స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ దిగ్భ్రాంతి

బాణసంచా విస్ఫోటన ఘటన తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఇక్కడకు చేరుకున్నారు. ఏడుగురి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.



హోం మినిస్టర్ అనితకు వివరాలు చెబుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కలెక్టర్ మహేష్‌కుమార్

- ఉలిక్కిపడ్డ రాయవరం
- భోజన సమయంలో ప్రమాదం
- పేదల బతుకులపై ఫైర్
- అక్కడికక్కడే ఆరుగురి మృతి
- చెల్లాచెదురుగా మృతదేహాలు
- ఆసుపత్రిలో మరొకరు
- హృదయ విదారకంగా కేంద్రం
- హోం మంత్రి అనిత పరామర్శ



వీఎస్ఎన్ మూర్తి, పి.వెంకట రమణ, పాకా అరుణ, కుడుపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, చిట్టూరి శ్యామల

మృతులు వీరే...

ప్రమాదంలో నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు మరణించారు.బిక్కవోలు మండలం కొమరిపాలెంనకు చెందిన ఫైర్స్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి (68) అలియాస్ సత్తిబాబు ఉన్నారు. కార్మికులు పాకా అరుణ (33)(సోమేశ్వరం), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50) ఘటనా స్థలంలోనే గుర్తు పట్టలేని రీతిలో సజీవ దహన మయ్యారు. బిక్కవోలు మండలం కొమరపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విస్ఫోటనం జరిగిన ప్రదేశంలో 12 మంది ఉండగా, 10 మంది మంటల్లో చిక్కుకుపోగా ఇద్దరు మాత్రం పక్కనే ఉన్న పంట పొలంలోకి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. మూడు పశువులు గాయపడగా స్థానిక పశువుల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



బాణసంచా కేంద్రం నుంచి మృతదేహాల తరలింపు.. పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో దేవరకొండ అఖిల

అటెన్షన్ ప్లీజ్.. 2వది!

అమలాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది రోజుల్లో రెండో ప్రమాదమిది. గత నెల 30వ తేదీ మంగళవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసలో బాణసంచా పేలుడు జరిగింది. కిరాణా వ్యాపారం నిర్వహించే ఇక ఇంటి వద్ద నిల్వ ఉన్న బాణసంచాను అటకపై నుంచి దించుతుండగా ప్రమాదశాత్తూ పేలి దంపతులు కంచర్ల శ్రీనివాస్ (50), భార్య సీతామహలక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందారు. భవనమంతా ఛిద్రమై నేలమట్టమైంది. ఇప్పుడిది.

10 మందిని కాపాడిన ఫంక్షన్

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రాయవరం- కొమరిపాలెం శివారులో ఉన్న ఈ బాణసంచా కర్మాగారంలో పనిచేసేందుకు గత మూడు నెలలుగా 16 మంది మహిళలు అనపర్తి, అనపర్తి సావరం నుంచి రోజువారీ వెళుతున్నారు. బుధవారం కూడా 16 మంది పనికి వెళ్లాల్సి ఉండగా, వీరిలో పదిమంది సావరంలో శుభకార్యంలో పాల్గొనాల్సి రావడంతో ఆరుగురు మాత్రమే పనికి వెళ్లారు. దాంతో మిగిలిన వారంతా ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లైంది. మూడు నెలలుగా ఒకేచోట పనిచేస్తూ కలిసి వెళ్లి వచ్చే వారిలో ముగ్గురు లేరన్న వార్తతో విషాదంలో మునిగిపోయారు.

వందేళ్ల నుంచి తయారీ

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం, బిక్కవోలు సామర్లకోట మండలం జి.మేడపాడు పరిసర ప్రాంతాల్లో బాణసంచా తయారీ శతాబ్ది కాలంగా కొన్ని కుటుంబాలకు ఆనవాయితీగా వస్తోంది. కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల కుటుంబానికి బాణసంచా తయారీకి పెట్టింది పేరు. ఇక్కడి నుంచి బాణసంచా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకే కాకుండా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ఎగుమతి జరిగేవి. రాజకీయ పార్టీల విజయోత్సవాలకు, టీడీపీ మహానాడుకూ ఇక్కడ నుంచే మందుగుండు సామగ్రిని తరలించేవారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు వీరికి అనేక పర్యాయాలు సత్కారం చేశారు.

ఎమ్మెల్యే తనయుడి వాహనంలో తరలించినా..



ప్రమాద సమాచారం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన తనయుడు టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలిన గాయాలతో నరకయాతన అనుభవిస్తున్న కొమరిపాలెం గ్రామానికి చెందిన పొట్నూరి వెంకటరమణను మనోజ్‌రెడ్డి వాహనంలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ అనపర్తిలో ఒక ఫైనాన్స్ వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తాడు. ఖాళీ సమయాల్లో కేంద్రానికి వస్తుంటాడు.. బుధవారం కూడా అలాగే వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడలో చికిత్స పొందుతూ మరణించాడు. ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రమాద స్థలం నుంచే సీఎం చంద్రబాబుకు ఇక్కడి పరిస్థితిని ఫోన్ ద్వారా వివరించారు.

చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ఘటన : ఐజీ



చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ప్రెజర్ పెరిగి నిప్పు రవ్వలు ఎగసిపడడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్టుగా భావిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ చెప్పారు. రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌కు 2026 మార్చి వరకు బాణసంచా తయారీ అనుమతి ఉందన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తరువాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

భయపడి పరుగు తీశాం..



బాణసంచా తయారు చేసే కేంద్రంలో తరచూ తయారీ దారులు మందు గుండు కాల్చడం ట్రైల్ రన్ వేస్తుంటారు. అలాంటిదే బుధవారం రాయవరంలో జరిగి ఉండొచ్చు. భోజన సమయంలో చూస్తుండగానే భారీ శబ్దాలతో కూడిన మంటలు వ్యాపించాయి. మా ఇంటి వద్ద భోజనం చేసే సమయంలో ఈ సంఘటన జరగడంతో కుటుంబమంతా పరుగులు తీశాం.
- గులిపే కృష్ణవేణి, ప్రత్యక్ష సాక్షి



ధ్వంసమైన షెడ్



ప్రమాదంపై ఐజీ అశోక్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా నాయుడు బాధ్యతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా పి.నాయుడు నియమితులయ్యారు.ఆయన ఇప్పటి వరకూ రుడాకు పనిచేశారు.ఇక్కడ సీపీగా పనిచేసిన కోటయ్య బదిలీ కాగా ఆయన స్థానంలో నాయుడిని నియమించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఫుడ్ కమిషన్ సభ్యుడి ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో ఫుడ్ కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కోరుకొండ, గోకవరం, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ మండలాల్లోని హాస్టళ్లు, పాఠశాలలు, రేషన్ షాపులు,అంగన్వాడీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.గోకవరం జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం లేకపోవడంతో హెచ్ఎంకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సూచించారు. గురువారం కొవ్వూరు డివిజన్‌లో పర్యటిస్తారని డీఎస్‌వో వి.పార్వతి తెలిపారు.

నేటి నుంచి బాణసంచా యూనిట్లు తనిఖీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ ప్రకియను రెండు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయాలని యజమానులు, నిర్వాహకులను జేసీ వై.మేఘ స్వరూప్ ఆదేశించారు.జేసీ చాంబర్ నుంచి ఆయన అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయవరంలో బుధవారం జరిగిన ప్రమాదం నేపథ్యంలో జిల్లాలోని బాణసంచా తయారీ, విక్రయ యూనిట్ల వద్ద భద్రతను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఆయా బృందాలు గురు, శుక్రవారాల్లో యూనిట్లను పరిశీలిస్తాయని తెలిపారు. తనిఖీ బృందాలు వచ్చే సమయానికి సంబంధిత పత్రాలు, వివరాలు సిద్ధంగా ఉంచాలని, భద్రత ప్రమాణాలకు సంబంధించిన న్ని వివరాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. బాణసంచా తయారీదారులు, విక్రయదారులు రెవెన్యూ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫైర్, పోలీసుశాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీచేయాలన్నారు.

దివ్యాంగత్వం పునఃపరిశీలనకు శిబిరాలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద దివ్యాంగుల పునఃపరిశీలన తర్వాత కొందరు దివ్యాంగుల వైకల్య శాతం తగ్గినట్లు గుర్తించడం జరిగిందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీంతో అప్పీలు చేసుకున్న వారికి మళ్లీ పరీక్షలు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రులు, అనపర్తి ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపులను నిర్వహించి దివ్యాంగత్వ ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2231 మంది అప్పీలు చేసుకున్నారన్నారు. రోజుకు.. దివ్యాంగత్వం(లోకోమోటివ్) ఉన్న 30, చెవిమాంద్యం 30, కంటి చూపు మాంద్యం 20, మానసిక లోపం 20 మందికి వైద్య పరీక్షలు చేస్తారన్నారు.అప్పీలు చేసుకున్నవారు కేటాయించిన తేదీల్లో ఆసుపత్రులకు హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్,రమణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలేదని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.విద్యాసాగర్, డీవీ.రమణ అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో జరిగిన తూర్పుగోదావరి జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ, డీఏలు,జీపీఎఫ్‌లు, సరెండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందన్నారు.వాటిని నిలదీస్తే అక్రమ కేసులు బనాయించారన్నారు. హెచ్‌ఆర్‌ఏని 4 శాతం తగ్గించి ఉద్యోగులే తమకు వేతన సవరణ వద్దు పాతజీతాలే ఇవ్వండనే పరిస్థితికి కల్పించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెలనెలా 1న జీతాలు వస్తున్నాయన్నారు.గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు 80 శాతం వరకు ఎత్తివేసిందన్నారు. జీపీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, సీపీఎస్ కంట్రిబ్యూషన్‌లో రూ.10 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో 11 వేల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో 3 వేల మందిని క్రమబద్ధీకరించారని మిగిలిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. రాష్ట్రంలో 12లక్షల 30వేల మంది ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జేఏసీ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులు శ్యామల సెంటర్ నుంచి ఆనం రోటరీ హాలు వరకు భారీ ర్యాలీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎన్జీవో సంఘం నాయకులు పసుపులేటి శ్రీనివాస్,జగదీశ్వరరావు,రాజ్యలక్ష్మి, జానకి పాము, శ్రీనివాస్, వేణుమాధవ్, రామారావు, జానకి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అడహాక్ కమిటీ ఏర్పాటు

ఏపీఎన్జీవో సంఘం తూర్పుగోదావరి జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్‌గా మీసాల మాధవరావు ఎన్నికయ్యారు.కోఛైర్మన్‌గా ప్రవీణ్ కుమార్, కన్వీనర్‌గా అనిల్ కుమార్, సభ్యులుగా ఎం.సత్యనారాయణ రాజు, ఎన్.వెంకటేశ్వరావు, కె.నందీశ్వరుడు,ఎస్.వెంకటరమణ ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు , ఖజానా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.





ఛైర్మన్ రత్నకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

కొవ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా సీహెచ్.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో ఆర్వోగా పని చేస్తూ పదోన్నతిపై కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా వచ్చారు. పట్టణంలో ఏ సమస్య ఎదురైనా నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.




ఉత్సవంలో కనువిందు చేసిన హంస, గరుత్మంతుడు, ఏనుగు వాహనాలు

నయనానందకరం... విజయభేతాళ ఉత్సవం

ఒకేచోట కొలువుదీరిన 13 వాహనాలు... మిరుమిట్లు గొలిపిన బాణసంచా కాల్పులు

ఒళ్లు గగుర్పొడిచేలా యువకుల విన్యాసాలు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



వినాయక వాహనం



శక్తి వేషం



అగ్గిబరాటా విన్యాసాలు

అంబాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్, ఫలపుష్పాలతో అలకరించిన వాహనాలు... మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పులు... గరగ నృత్యాలు... సాంస్కృతిక ప్రదర్శనలు... కత్తిసాము, అగ్గిబరాటాలతో యువకుల విన్యాసాలు కనువిందు చేశాయి. వీటికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో బుధవారం రాత్రి జరిగిన శ్రీవిజయభేతాళస్వామి 59వ వార్షికోత్సవం వేదికైంది. అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల వారే కాకుండా ఆ ప్రాంతం నుంచి వెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు వేలాదిగా తరలివచ్చారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని 13 ప్రాంతాలకు చెందిన వాహనాలు తొలుత అక్కడ ఉత్సవం నిర్వహించుకుని అనంతరం మాచవరం సెంటర్లో కొలువుదీరాయి. యువకులు చేసిన చెడీ తాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటా విన్యాసాలు ఒళ్లు గగుర్పాటుకు గురిచేశాయి. అంబాజీపేట నాలుగు రోడ్ల కూడలిలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భారీ స్క్రీన్లతో సుమారు ఐదు సినీ ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేయడంతో యువకులు ఉత్సాహంతో డ్యాన్స్ చేశారు.

13 వాహనాలు ఒకేచోట కొలువుదీరాయి. శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి దుర్గమ్మ అమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాత పోస్టాఫీస్) నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటీకాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస, చప్పిడివారిపాలెం నుంచి షిర్డీ సాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు, నందంపూడి నుంచి రాజరాజేశ్వరీదేవి వాహనాలు వచ్చాయి.

విజయభేతాళస్వామిని మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ఉత్సవాన్ని తిలకించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీచైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు వాసంశెట్టి చినబాబు, దాసరి సత్యనారాయణ, కొర్లపాటి గోపి, షైపాల తాతాజీ, దొమ్మేటి శ్యామ్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జునమోహనరావు... స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



విజయభేతాళ ఉత్సవం వద్ద కత్తులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తిలకించడానికి తరలివచ్చిన జనసందోహం



పోస్ట్.. అంటూ పోస్ట్‌మెన్ పిలిచే పిలుపుతో ఇంట్లో ఏ మూల, ఏ పనిలో ఉన్నా బయటకు రక్కున రావాల్సిందే. ఇంటికి వచ్చిన చుట్టాలు తిరుగు పయనమైన వేళ వెళ్లిన వెంటనే కార్డు ముక్క రాద్దువూ! అనే మాట చెవిలో పడాల్సిందే. పొరుగూళ్లో చదువుకునే పిల్లలకు పోస్ట్‌మెన్ ద్వారా మనీఆర్డరు అందిందంటే ఆనందమే. ఆ తరంలోని ఉత్తరాల ఊసులే వేరంటారు పెద్దలు. అంతెందుకు కలం-స్నేహం గుర్తుందా! ఉద్యోగార్థులకు పోస్ట్‌మెన్‌ని చూడని రోజున నిద్రపట్టేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఎవరైనా మృతి చెందితే ప్రత్యామ్నాయ మాటగా టపా కట్టేశారుట అనేవారు కాదాండి!. టెలిగ్రాం అనే మాట వినిపిస్తే ఉరుకులు పరుగులే. తోకలేని పిట్ట తొంభై ఊర్లు చక్కర్లు కొట్టిందనే నానుడి ఎక్కడిది? ఆధునిక పోకడలు రాక ముందున్న తపాలా జనాల్లో మమేకమైపోయింది. ఆ కబుర్లనీ పాత సినిమాల్లో మనం వినవచ్చు. అయితే ఫోన్ల ద్వారానే డబ్బులు పంపే విధానం వచ్చి మనియార్డరు ఫారాల అచ్చును ఆపేసినా.. ఈ-మెయిల్, వాట్సాప్ వచ్చి ఉత్తరాలను వెనక్కు నెట్టేసినా.. ఎర్రటి తపాలా బాక్సులు లేకపోయినా ఇప్పటికీ తపాలా వైభవమేమీ తీసిపోలేదు. ఆధునిక పోకడలను అందిపుచ్చుకుంటూ తనకు తాను తీర్చిదిద్దుకుంటూ ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తోంది. పోస్టాఫీస్ అంటే ఓ నమ్మకంగా జనం హృదయాల్లో ఓ ముద్ర వేసుకుని సాగుతోంది. నేడు అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.



- తోకలేని పిట్టకు క్రీ.పూ. 3వ శతాబ్దంలో మూలాలు
- అప్పట్లో పావురాలు, గుర్రాలు, దూతల ద్వారా టపా
- కాలక్రమేణా బలమైన సమాచార చేరవేత వ్యవస్థగా రూపాంతరం
- మనీఆర్డరుతో ఆనందం... టెలిగ్రాం వస్తే బెంబేలు
- జనంతో మమేకమైన తపాలా సేవలు



పోస్ట్... పోస్ట్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రాచీన కాలంలో దూతలు, పావురాలు, గుర్రాల ద్వారా సందేశాలను పంపించడం తపాలా వ్యవస్థకు అంకురార్పణగా చెప్పవచ్చు. క్రమేణా క్రీ.పూ.3వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుని పాలనలో ఒక శాసన సంబంధమైన సమాచార వ్యవస్థ ఏర్పడింది. ఆధునిక తపాలా వ్యవస్థ దేశంలో బ్రిటిష్ పాలకుల సమయంలో వచ్చింది. 1766లో లార్డ్‌క్లైవ్ కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారిక సమాచార మార్పిడి తపాలా సేవగా మొదలైంది. 1854లో తపాలా చట్టాన్ని తీసుకొచ్చిన లార్డ్ డల్హౌసీ ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్స్ అనే హోదాను ఏర్పరిచారు. అప్పటి నుంచే దేశమంతా ఒకే రకమైన తపాలా రుసుములు అమల్లోకి వచ్చాయి. అదే సమయంలో మొదటి తపాలా స్టాంపు 'సింద్ డాక్' విడుదలైంది.

1947 తర్వాత భారత తపాలా శాఖ గ్రామ గ్రామానికీ విస్తరించింది. తన ఉనికికి ఎల్లలు లేవంటూ దూసుకుపోయింది. మనీఆర్డర్లు, సేవింగ్స్ ఖాతాలు, తపాలా జీవిత బీమా వంటి సేవలు ప్రజల జీవితంలో భాగమైపోయాయి. లేఖలు బట్వాడా చేసే వ్యవస్థగా కాకుండా ఆర్థిక, సామాజిక సేవల కేంద్రంగా రూపు దిద్దుకుంది. 1980 నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ 1986 నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా వేగవంతమైన టపాను అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక విధానంతో సంప్రదాయ మనీఆర్డరు కనుమరుగవుతున్న తరుణంలో ఈ-మనీఆర్డరును తెరపైకి తెచ్చింది. క్రమంగా కంప్యూటరైజేషన్ ద్వారా తపాలా కార్యాలయాలు ఆధునిక రూపంలోకి వచ్చాయి. మరిన్ని సేవలను ప్రజలకు చేరువ చేస్తూ మార్పులు చేశారు. ఇదే ఊపుతో భారత తపాలా వ్యవస్థ 'డాక్ సేవ నుంచి డిజిటల్ సేవల వరకు' అనే నినాదంతో ప్రజల గుమ్మాలకు మరింత చేరువవుతోంది.

- తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా గ్రామీణ ప్రజలను ఆర్థిక చేరికలో భాగస్వాములను చేసింది. ఆధార్ ముఖ ఆధారిత ప్రామాణీకరణ ద్వారా డిజిటల్ లావాదేవీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ బ్యాంకులో ఎక్కడా లేని విధంగా కేవలం రూ.200తో ఖాతా తెరుచుకోవచ్చు. డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలనూ తీసుకొచ్చింది. ఆర్థిక సంస్థలతో భాగస్వామ్యం ద్వారా రివరల్ సేవలు కూడా అందిస్తోంది.
- ఆడపిల్లలకు భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక భరోసాగా 2014 నుంచి సుకన్య సమృద్ధి యోజన అందిస్తోంది. ఈ పథకం ద్వారా పొందే వడ్డీ, గడువు తీరాక వచ్చే మొత్తానికి కూడా పన్ను ఉండదు.
- పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, పోస్టాఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, టైమ్ డిపాజిట్ పథకాలు, నెలనెలా నిర్ణీత మొత్తం పొదుపు చేసే రికరింగ్ డిపాజిట్, నెలవారీ ఆదాయ పథకం, కిసాన్ వికాస పత్రం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పోస్టల్ ఇన్సూరెన్స్, పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, ఆధార్ సేవలు.. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో పథకాలు, సేవలు తపాలా శాఖ ద్వారా అమలవుతున్నాయి.
- 1874లో స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) నిర్వహించిన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబరు 9న అంతర్జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1969లో జపాన్‌లోని టోక్యోలో జరిగిన యూపీయూ కాంగ్రెస్ దీనిని ప్రకటించింది. ప్రజలకు తమ దైనందిన జీవనంలో తపాలా పాత్ర, ప్రపంచ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తపాలా వ్యవస్థ సహకారం వంటి వాటిపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం.

సరళం, సులభం, నమ్మకం... పోస్టల్ సేవలు

కోటా శేషారావు
సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, తూర్పు గోదావరి



కాలక్రమేణా ఎన్ని మార్పులు వచ్చినా తపాలా సేవలు ఎప్పుడూ ప్రజలకు చేరువగా, వారి మేలుకోరి ఉంటాయి. సరళంగా, సులభంగా ఉండడంతో పాటు నమ్మకమైన సేవలు అందించడం తపాలా శాఖకు తొలి నుంచీ ఉన్న ఒక గొప్ప కీర్తిగా చెప్పవచ్చు. ఉదాహరణకు ఇన్సూరెన్స్ చాలా తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తంలో బోనస్ ఇస్తున్నాం. బయట నుంచి ఏజెంట్లు చాలా తక్కువ. దాంతో ఏజెంట్ల కమీషన్ ఉండదు. అందువల్ల ఆ లాభాన్ని వినియోగదారుడికే ఇస్తున్నాం. గతంలో ఉద్యోగులు మాత్రమే పీఎల్ఐకి అర్హులు. ఇప్పుడు అర్బన్‌లో ప్రతి గ్రాడ్యుయేట్ పీఎల్ఐ చేసుకోవచ్చు. గ్రామీణంలో ఆర్పీఎల్ఐ డిజైన్ చేశారు. ఇలా ఎన్నో సేవలు ఉన్నాయి. ప్రజలు వినియోగించుకున్నప్పుడే వాటి ఉద్దేశం నెరవేరుతుంది.

హోమ్ కేర్ నర్స్ ఉద్యోగ అవకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుద్యోగ మైనార్టీ యువతకు హోమ్ కేర్ నర్స్ ఉద్యోగాల కోసం ఓవర్సీస్ మెస్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్,ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఖతర్ దేశంలోని దోహాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(నర్సింగ్)/జీఎన్ఎం(నర్సింగ్) అర్హత కలిగి, వయస్సు 21 నుంచి 40 ఉండాలన్నారు. స్త్రీ, పురుష అభ్యర్థులు, 2 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. వారానికి ఆరు రోజులు, రోజుకి 12 గంటలు పని చేయవలసి ఉంటుంది అన్నారు. జీతం నెలకు 5,250 రియల్స్(రూ.1.20 లక్షలు), రెండేళ్ల కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయవలసి ఉంటుందన్నారు. అదనంగా టాక్స్-ఫ్రీ శాలరీ తగ్గింపులు ఉండవు, నివాసానికి, మెడికల్, ట్రాన్స్ఫర్, ఫ్రీ వీసా, ఫ్లైట్ ఛార్జ్(సెలెక్ట్ అయినవారికి), సంవత్సరానికి 20 రోజులు లీవ్ బెనిఫిట్స్ ఉంటాయన్నారు. భోజనం సర్వీస్ చార్జీలు రూ.30 వేలు+ జీఎస్టీ అభ్యర్థి భరించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు పాస్ పోర్ట్, విద్యార్హతలు సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లతో దరఖాస్తులను నేరుగా ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హెడ్ ఆఫీస్, విజయవాడ అడ్రస్‌కు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సంచాలకులు పేర్కొన్నారు. 13న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఏడుగురి ఎంపిక



రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దివాన్‌చెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థులు ఏడుగురు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో ముగ్గురు, అండర్-19 విభాగంలో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో బాటు కోచ్‌లు బోళ్ల రామకృష్ణ, ముత్యాల నాగేంద్రను మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు అనపర్తి విద్యార్థులు

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరుగనున్న వివిధ క్రీడా పోటీలకు అనపర్తి జీబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు పలువురు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలిపారు. అనంతపురంలో జరిగిన పదో ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు తమ విద్యార్థి హేమంత్ దుర్గ కీలక భూమిక పోషించినట్టు చెప్పారు. అలాగే అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ప్రసన్న భార్గవి, వాలీబాల్ జట్టుకు సాయినాధ్‌రెడ్డి, బాస్కెట్‌బాల్ జట్టుకు అజయ్ సూర్య, త్రోబాల్‌కు గీత, తనూజ, సింధు, దుర్గాభవాని ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. వీరిని అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన అనపర్తి విద్యార్థులు

14న 'నన్నయ'లో జిల్లా స్థాయి యువజనోత్సవం

సెట్రాజ్ సీఈవో విశ్వేశ్వరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025ను ఈ నెల 14న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. స్వామివివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్, కాకినాడ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుపనున్నామని బుధవారం తెలిపారు. యువతీయువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు వీలుగా 15-29 సంవత్సరాల మధ్య వయసున్న వారికి పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జానపద నృత్యం(బృందం), జానపద గేయం (బృందం) కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్, డిక్లమేషన్ పోటీలను, ఇన్నోవేషన్ ట్రాక్లో సైన్స్‌మేళా ప్రదర్శన అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు, వాటిలో ప్రథమస్థానం పొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ కార్యాలయం లింక్ ద్వారా నమోదు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు కాకినాడలోని సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

జేఎన్టీయూ గురజాడవిజయనగరం

వీసీగా సుబ్బారావు



జేఎన్టీయూకే, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం(జేఎన్టీయూజీవీ) నూతన ఉప కులపతిగా కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విస్సాకోడేటి వెంకట సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ బుధవారం జీవో జారీ చేసింది. ఈయన ప్రస్తుతం కాకినాడ జేఎన్టీయూ రెక్టార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఫారిన్ యూనివర్శిటీ రిలేషన్స్ డైరెక్టర్‌గా,ఏపీపీజీఈసెట్ కో-కన్వీనర్‌గా, ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, విద్యోన్నతి పథక కన్వీనర్‌గా, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గా, జేఎన్టీయూకే రిజిస్ట్రార్‌గా, ఏపీఈఏపీసెట్-2025 కన్వీనర్‌గా వ్యవహరించారు. సుబ్బారావు వీసీ పదవిలో మూడేళ్లు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సుబ్బారావును జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్,రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.


అంతర్వేదిలో నటి రోజా పూజలు



అంతర్వేది, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సినీనటి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వరుడు కళ్యాణి బుధవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న వారికి వేద పండితులతో మహాదాశీర్వచనం జరిపించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెంట్ పి.విజయసారధి అందించారు.

రిపబ్లిక్ డే ప్రీ పరేడ్ శిబిరానికి

హేమంత్‌కుమార్ ఎంపిక



జేఎన్టీయూకే, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఎన్ఎస్ఎస్ వలంటీరు సింగంపల్లి హేమంత్‌కుమార్ వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపికైనట్టు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అక్టోబరు 31 నుంచి నవంబరు 9 వరకు ఈ శిబిరం జరుగుతుంది. హేమంత్‌ను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవో కిరణ్మయి అభినందించారు.

ఆఫ్రికన్ నత్తలతో..

కొబ్బరి, అరటికి నష్టం లేదు

- ప్రస్తుతం అవి బెండ, ఆనబ పంటలను ఆశిస్తున్నాయి
- కీటక విభాగ శాస్త్రవేత్త అనూష.. గంగలకుర్రులో క్షేత్రస్థాయి పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గంగలకుర్రులో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఇన్‌సెట్లో) బెండ మొక్కలను ఆశించిన ఆఫ్రికన్ నత్తలు



అంబాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై నత్తలు చేస్తున్న దాడిని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. 'ఉద్యాన పంటలపై నత్తల దాడి' శీర్షికన మంగళవారం వెలువడిన కథనానికి శాస్త్రవేత్తలు స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రులోని చిరతపూడి ఆంజనేయులు కూరగాయల తోటలను క్షేత్రస్థాయిలో వేకువజామునే కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ అనూష ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ ఆఫ్రికన్ నత్తలు ప్రస్తుతం బెండ, ఆనబ పంటలను ఆశించి తీవ్రంగా నష్టాన్ని కలుగుచేస్తున్నాయన్నారు. కొబ్బరి, అరటిలో ఈ ఉనికి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎటువంటి నష్టాన్ని కలుగజేయడం లేదని చెప్పారు. ఇవి రాత్రుళ్ల భూమిలో నుంచి పైకి వచ్చి పంటలను ఆశించి తెల్లవారే సమయానికి మొక్కల కిందకు, తోటల్లోని చెత్తాచెదారల్లోకి చేరిపోతున్నాయన్నారు. ఈ నత్తలు ఆఫ్రికా నుంచి వందల ఏళ్ల క్రితమే భారతదేశం వచ్చినప్పటికీ ఇటీవల మన రాష్ట్రంలోని పార్వతీపురం, మన్యం, తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి, కోనసీమలో వీటి ఉధృతిని శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు గుర్తించారని అనూష చెప్పారు. వీటి నివారణకు తక్షణం తోటల్లోని కలుపు మొక్కలను, చెత్త కుప్పలను తొలగించి తోటలను శుభ్రంగా ఉంచాలన్నారు. రాత్రుళ్ల నీరు పారించకూడదని, అవకాశం ఉన్నచోట తోటల్లో బాతులు, కోళ్లను పెంచుకోవాలన్నారు. పొలం గట్లపైన 1 కిలో ఉప్పును 4 లీటర్ల నీటితో కలిపి ముంచిన గోనె సంచులను పరచాలి. దీనివల్ల పక్కన ఉన్న తోటలోకి వ్యాప్తి చేయకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

సత్వర నివారణకు...

చిలేటెడ్ కాపర్ 3 గ్రాములు, ఫెర్రోమేగ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారీ చేస్తే నత్తలు 2 నిమిషాల్లోనే కిందపడి 95 శాతం చనిపోతాయి. కొన్నింటిలో కదలిక ఉన్న కింద పడిన నత్తలను ఏరి 5 కిలోల గడ్డ ఉప్పు కరిగించిన ద్రావణంలో వేస్తే కచ్చితంగా చనిపోతాయి. చివరి నత్త వరకూ చంపాలి. రైతులు సమగ్ర యజమాన్య పద్ధతులు సత్వరమే పాటించి ఈ నత్తల నుంచి పంటలను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్త అనూష సూచించారు.

స్వదేశీ వస్తువులే వినియోగించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికిరణ్
- పి.గన్నవరంలో ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికిరణ్

పి.గన్నవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అందరూ ప్రతి నిత్యావసరాలకు స్వదేశీ వస్తువులను మాత్రమే వినియోగించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రవికిరణ్ అన్నారు. పి.గన్నవరంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు.2014కు ముందు దేశంలో ఎగు మతులు 250 మిలియన్ డాలర్లు ఉంటే దిగుమతులు 500 మిలియన్ డాలర్లు ఉండేవని, 2014 తర్వాత ప్రధాని మోదీ వచ్చి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.ఈ పదేళ్లలో 900 మిలియన్ డాలర్ల ఎగుమతులు పెరిగాయన్నారు. బీజేపీ జాతీయ కార్యమండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ ఈ మూడు నెలల్లో ఒక కన్వీనర్, ఇద్దరు కో-కన్వీనర్లు ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇటీవల జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమితుడైన ఎస్.సాదిక్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, మండలాధ్యక్షుడు తిక్కా సత్తిబాబు, చీకరమిల్లి శ్రీనివాసరావు, గొల్లకోటి వెంకటరెడ్డి, మాలే శ్రీనివాసనగేష్, ఇళ్ల సత్యనారాయణ, టి.రామకృష్ణారెడ్డి,చెరుకూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆవేదన.. ఆక్రందన..




కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రులు

బాణసంచా పేలుడు ఘటన క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స .. బాధిత కుటుంబీకుల రోదనలు



తన తల్లి విజయలక్ష్మిని బతికించమని డాక్టర్‌ను వేడుకుంటున్న కూతురు

జీజీహెచ్(కాకినాడ) అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి.సావరం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం జరిగిన భారీ విస్ఫోటనంలో తీవ్రగాయాల పాలైన క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో 90 శాతంపైన కాలిపోయిన ఇద్దరు మహిళలు, ఒక యువకుడికి జీజీహెచ్ అత్యవసర విభాగంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు ప్రథమ చికిత్స అందిస్తుండగా క్షతగాత్రుల రోదనలతో ఆ ప్రాంతం దిక్కులు పికటిల్లేలా మిన్నంటింది. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన 45 ఏళ్ల వాసంశెట్టి విజయలక్ష్మికి భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమార్తె దుర్గ కూడా తల్లితోపాటు గతేడాది కాలంగా ఆ బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తోంది. అలాగే అనపర్తికి చెందిన 30 ఏళ్ల చిట్టూరి యామినికి భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆమె గతేడాది కాలంగా పని చేస్తోంది. అలాగే పెదపూడి మండలం వేంద్ర గ్రామానికి చెందిన 21 ఏళ్ల లింగం వెంకటకృష్ణ అలియాస్ చిన్నాకు తండ్రి రాము, తల్లి వెంకటలక్ష్మి, అన్నయ్య చంద్రశేఖర్ ఒక అక్క ఉన్నారు. కాగా వెంకటకృష్ణ గత 5ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నాడు. అయితే బాణసంచా తయారీ కేంద్రంలో చిచ్చు బుడ్డును సుత్తితో దట్టించే క్రమంలో అగ్ని నెరుసులు విరజిమ్మి బాణసం చా మందుపై పడడంతో ఈ విస్ఫోటనం జరిగినట్టు ప్రమాదం నుంచి తప్పించుకుని క్షేమంగా బయట పడ్డ కార్మికులు చెప్పారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి 48 గంటలు దాటితే కాని చెప్పలేమని సర్జరీ వైద్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ అభిలాష్ తెలిపారు.

నేడు పోస్టుమార్టం..

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రమాద ఘటనలో సజీవ దహనమైన ఆరుగురి మృతదేహాలను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబీకులకు అందజేయనున్నట్టు ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ చెప్పారు. కాకినాడలో మరణించిన మరో వ్యక్తికి అక్కడే పోస్టుమార్టం చేయనున్నారు.

3 కుటుంబాల్లో విషాదం..

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాణసంచా ప్రమాదంలో అనపర్తికి చెందిన ముగ్గురు మహిళలు సజీవదహనం కావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గత 3నెలలుగా బాణాసంచా తయారీకి అనపర్తి నుంచి 16 మంది మహిళలు పనిచేసేందుకు వెళ్తున్నారు. బుధవారం ఆరుగురు మాత్రమే పనికి వెళ్లగా ముగ్గురు సజీవదహనం కాగా, మరో మహిళ తీవ్ర గాయాలతో పోరాడుతోంది. మరో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. మృతిచెందిన వారిలో అనపర్తి సావరానికి చెందిన కురుపూడి జ్యోతి (51), పెంకే శేషారత్నం(38), చిట్టూరి శ్యామల(33) ఉన్నారు. మరో మహిళ చిట్టూరి హేమ తీవ్రగాయాలతో కాకినాడఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ కలెక్టర్

రాయవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాయవరంలో ఫైర్ వర్క్స్ నిర్వాహకులు పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించారన్నారు. గత నెల 29న అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు కూడా చేశారన్నారు. యజమాని సహా ఆరుగురు కూలీలు మృతి చెందడం బాధాకరమని,వారి కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు 37 ఉన్నాయని, 2 రోజుల్లో బాణసంచా తయారీ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని నిర్వాహకులపై కఠినచర్యలుతీసుకుంటామని చెప్పారు.

లోతుగా దర్యాప్తు చేస్తాం : ఎస్పీ

రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడు సంఘటనపై లోతైన దర్యాప్తు చేస్తామని ఎస్పీ రాహుల్‌మీనా చెప్పారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి శాంపిల్స్ సేకరించిన తరువాత వచ్చిన రిపోర్టు ఆధారంగా ఎలా జరిగిందనే విషయం వెల్లడవుతుందని తెలిపారు.

శాంపిల్స్ సేకరించిన తర్వాత స్పష్టత

పేలుడు సంఘటనా స్థలానికి రీజనల్ ఫైర్ అధికారి స్వామి చేరుకుని ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించారు. బాణసంచా తయారీ చేసే సమయంలో ప్రమాదవశాత్తూ ఫైర్ అయ్యి ఈ సంఘటన జరిగి ఉండవచ్చన్నారు. ఇక్కడ జరిగిన సంఘటనపై విజయవాడ నుంచి క్లూస్ టీం వచ్చి శాంపిల్స్ సేకరించిన తరువాత సంఘటనపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. ఆయన వెంట జిల్లా ఫైర్ అధికారి పార్థసారథి ఉన్నారు.

బాణసంచా పేలుడులో ఏడుగురు మరణించడం కలచివేసింది

మంత్రి వాసంశెట్టి సుభాష్



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాయవరం/మండపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశానికి హాజరైన మంత్రి సంఘటన విషయం తెలుసుకున్న మంత్రి హుటాహుటిన రాయవరం చేరుకుని సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. బాణసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్, అగ్నిమాపక సిబ్బంది, కూటమి నాయకులు ఉండవిల్లి శివ తదితరులు ఉన్నారు.

చాలా బాధాకరం

మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): రాయవరంలో బాణసంచా పేలుడు ఘటన బాధాకరమని, పండగ ముందు ఈ విషాద సంఘటన ఆయా కుటుంబాలను కలచి వేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో స్వయంగా మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

బాణసంచా పేలి ఏడుగురు మృతి చెందిన సంఘటన తనను కలచి వేసిందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బార్బడోస్‌లోని బ్రిడ్జిటౌన్‌లో ఈనెల 12వ తేదీ వరకూ జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లిన ఆమె ఈ సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ఆమె సానుభూతి తెలిపారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రమాద బాధితులకు అండగా ఉంటుందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎంపీ హరీష్

అమలాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం శివారులో బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం సంభవించిన ఘోర విస్ఫోటనంలో ఏడుగురు మృత్యువాత పడడం బాధాకరమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించి వారిని ఆదుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వారికి వెలుగులు.. వీరికి చీకటి..!

- బతుకులను బుగ్గిపాలు చేసుకుంటున్న కార్మికులు
- రాయవరం విస్ఫోటనం ఘటనలో ఏడుగురు సజీవదహనం
- 93 ఏళ్ల నుంచి ఆ కుటుంబానికి అదే వారసత్వ సంపద
- ఫైర్‌వర్క్స్ యజమాని సత్తిబాబు మరణంతో కుటుంబంలో విషాదం



ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (ఫైల్)

అమలాపురం/రాయవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగులు ఎందరికో ఆనందాన్ని, ఉత్తేజాన్నిస్తాయి. కానీ వాటిని తయారుచేసే మరికొందరికి మాత్రం విషాదాలనే మిగులుస్తాయి. ఆ తరహా ఘటనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామ శివార్లలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఈ బాణసంచా విస్ఫోటన ఘటనలో ఫైర్‌వర్క్స్ యజమాని సహా ఏడుగురు సజీవ దహనమయ్యారు. వారిలో ఐదుగురు మహిళలే. వీరంతా సగటు కార్మికులే. జీవనోపాధి నిమిత్తమే ఇక్కడ పనులు చేసుకునేందుకు సమీప గ్రామాల నుంచి వచ్చి ఈ పరిశ్రమలో ఉపాధి పొందుతున్న వారిని బాణసంచా విస్ఫోటనం పొట్టన పెట్టుకుంది.

93 ఏళ్ల ప్రస్థానం..

రాయవరం శివారు కొమరపాలెం సరిహద్దుల మధ్యలో 93 ఏళ్ల కిందట వెలుగుబంట్ల కుటుంబీకులు బాణసంచా కర్మాగారాన్ని స్థాపించి వారసత్వ సంపదగా నిర్వహిస్తున్నారు. వెలుగుబండ్ల నారాయణమూర్తి 93 ఏళ్ల కిందట శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ పేరుతో స్థాపించిన ఈ బాణసంచా కర్మాగారం నుంచి వివిధ జిల్లాలతోపాటు వివిధ రాష్ట్రాలకు సైతం తయారైన బాణసంచా ఎగుమతి అవుతుంటుంది. నారాయణమూర్తి మరణానంతరం అతని కుమారుడైన వీరన్న నిర్వహించారు. అయితే 1990 నుంచి వెలుగుబడ్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఈ వ్యాపార సంస్థను వారసత్వ సంపదగా కొనసాగిస్తున్నారు. లైసెన్సులతోపాటు పక్కా రక్షణ వ్యవస్థతో ఈ భారీ బాణసంచా కర్మాగారాన్ని నడుపుతూ వచ్చారు. అయితే బుధవారం సంభవించిన విస్ఫోటనం భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్ష సాక్షులు కొందరైతే.. చిచ్చుబుడ్డు నిప్పురవ్వల కారణంగా విస్ఫోటనం సంభవించి ఏడుగురి మరణానికి కారణమైందని చెబుతుంటే.. హోంమంత్రి సహా అధికారులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చననే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ అమరావతి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీ నిపుణుల బృందం అధ్యయన నివేదిక ఇచ్చిన తరువాతే వాస్తవాలు వెల్లడవుతాయని వారు పేర్కొంటున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న ఈ బాణసంచా కర్మాగారంలో అప్పుడప్పుడు సంభవిస్తున్న ప్రమాదాల వల్ల పనిచేస్తున్న కార్మికులు తరచూ మృత్యువాత పడుతున్న ఘటనలు ఎన్నో. ఈ ఘటనలో మాత్రం యజమాని సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు అక్కడికక్కడే గుర్తుపట్టలేని రీతిలో సజీవ దహనం అయినతీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారు హృదయవిదారకంగా విలపిస్తున్నారు. ఎందరికో వినోదాన్నిచ్చే ఈ బాణసంచా తయారీ పరిశ్రమ మాత్రం పరిశ్రమల నిర్వహణదారులకు, వాటిలో పనిచేసే కార్మికుల పాలిట మృత్యుకూపంగానే మారుతోంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని భార్య మృతి.. భర్తకు గాయాలు

ప్రత్తిపాడు హైవేపై ఘటన



మృతి చెందిన సత్యవతి

ప్రత్తిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన అటికే సత్యనారాయణ, సత్యవతి దంపతులు ప్రత్తిపాడు నుంచి శరభవరం మోటార్ బైక్‌పై బుధవారం బయలుదేరారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా ధర్మవరం వైపు మార్గంలో వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అటికే సత్యవతి (58) అక్కడికక్కడే మృతిచెందగా ఆమె భర్త సత్యనారాయణ గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగిపై దాడి



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న త్రిమూర్తులు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు ఓ విశ్రాంతి ఉద్యోగిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన 71 ఏళ్ల వాసంశెట్టి త్రిమూర్తులు విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక మునలమ్మ గుడి సందులో ఉన్న ఆయన ఖాళీ స్థలాన్ని చూసుకునేందుకు బుధవారం ఉదయం వెళ్లారు. ఆ స్థలంలో ఖాళీ మద్యం సీసాలు ఉండడాన్ని గమనించి అక్కడ ఉన్న రాలి మహేష్ విష్ణురాజును అడిగారు. దాంతో గంజాయి మత్తులో ఉన్న ఆ యువకుడు కోపోద్రిక్తుడై అక్కడే ఉన్న ఖాళీ బీరు బాటిల్‌తో త్రిమూర్తులు తలపై విచక్షణా రహితంగా మోదడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గమనించి స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న త్రిమూర్తులును జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు నుంచి జారి పడి ఇద్దరి మృతి

తుని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ప్రాంతాల్లో మృతిచెందారు. కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో విశాఖపట్నం వైపు ముడిచర్ల ప్రాంతంలో రైలు నుంచి జారి పడి ఒకరు మృతి చెందగా మరొకరు కొత్తూరు గ్రామ సమీపంలో తిరుపతి రైలు జారి పడి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఇద్దరి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతదేహాలను ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు చెప్పారు. మృతుల సంబంధీకులెవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

బస్సు నుంచి జారి పడి మహిళ...

ద్రాక్షారామ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న బస్సు నుంచి దిగిపడిన మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరులో కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్న దమయంతి (65) జగన్నాధగిరి నుంచి ద్రాక్షారామకు బస్సులో వస్తూ బస్టాండు సమీపంలో బస్సు ఆగకుండా దిగే ప్రయత్నం చేసింది. జారి కింద పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఏరియా ఆసుపత్రికి తరలించేసరికి అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు రాకూడదు

- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి : ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ
- అన్నవరం దేవస్థానంలో కార్తీక మాస ఏర్పాట్లపై సమీక్షా సమావేశం
- గతేడాది మాదిరిగా గిరి ప్రదక్షిణలో ఉదయం పల్లకీసేవ, మధ్యాహ్నం సత్యరథసేవ



కార్తీక మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ఈవో, చైర్మన్

అన్నవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. బుధవారం అన్నవరం దేవస్థానంలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అజెండాలను చదివి వినిపించగా దానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై శాఖల అధికారులు లక్ష్యాలు నిర్దేశించారు. ఈనెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండగా నవంబరు 2న స్వామి వారి తెప్పోత్సవం, నవంబరు 5న గిరి ప్రదక్షిణ జరుగుతందని వీటితోపాటుగా ముఖ్యమైన పర్వదినాలు 15రోజులుగా నిర్ధారించి ఆ రోజుల్లో 50 వేల నుంచి లక్షమంది భక్తులు విచ్చేస్తారని అంచనావేస్తూ దానికణంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులు ఎక్కడా తోపులాటలు లేకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్ పాయంట్లను ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రధానంగా రూ. 300, 1000, 1500, 2000 వ్రతాల కోసం నిరీక్షించే భక్తులను ప్రత్యేక క్యూల ద్వారా ఆయా వ్రతమండపాలకు చేరుకుంటారని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా టూవీలర్లు, నాలుగుచక్రాల వాహనాలకు విడివిడిగా పార్కింగ్‌కు నిర్దేశించామన్నారు. టూవీలర్స్ పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద, 4చక్రాల వాహనాలు సత్యగిరి జంక్షన్ హరిహరమార్గ్, సీఆర్వో కార్యాలయం ఎదురుగా, ప్రకాష్‌సదన్ ఎదురుగా, ఈవో కార్యాలయ సమీపంలో స్థలం కేటాయించామని, సుమారు వెయ్యి నాలుగుచక్రాల వాహనాలకు పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అదనంగా 35 మంది హోంగార్డులు..

ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు మాట్లాడుతూ గతేడాది మాదిరిగా గిరిప్రదక్షిణలో ఉదయం స్వామివారి పల్లకీలో తిరిగేవిధంగా మధ్యాహ్నం భక్తులు సత్యరథం కూడా గిరియాత్ర చేపట్టాలని నిర్ణయించడంతో ప్రస్తు తం ఉన్న భద్రతాసిబ్బందికి అదనంగా 35మంది హోంగార్డులను నియమిస్తామన్నారు. ప్రస్తుతం 20 వాకీటాకీలుండగా మరో 40 వాకీటాకీలు తీసుకుని ఎక్కడా అవాంతరం లేకుండా చూస్తామన్నారు. స్త్రీశక్తి పథకం అమలులో ఉన్నందున మహిళాభక్తులు అధి కంగా వస్తారని అందుకోసం మహిళా హోంగార్డులను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే సీఐకు సూచించారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకునే బాధ్యత ఆలయ, సన్నిధి విభాగ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో 480 మరుగుదొడ్లు ఉండగా అదనంగా మరో 22 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4730 మంది వేచిఉండేలా హోల్డింగ్ పాయింట్లను, 925మందికి ఉచిత డార్మెటరీలలో లాకర్లు, స్నానపుగదులు అందుబాటులో ఉంచామన్నారు.


అగ్నిప్రమాదాల నివారణకు ప్రణాళిక

ఫైర్‌శాఖ అధికారులు కార్తీకం ప్రారంభానికి ముందే అగ్నిప్రమాద నివారణ నష్టం లేకుండా ముందుగా శిక్షణ ఇవ్వడంతో పాటుగా ఫైరింజన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించడం జరిగిందని దానికి పక్కా ప్రణాళికతో ముందుకెళతామని ఫైర్ ఆడిట్ జరుగుతందని తుని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

నెలరోజులు ఇద్దరు గజ ఈతగాళ్లు..

స్వామివారి తెప్పోత్సవానికి సంబంధించి పంపా రిజర్వాయర్‌లో 94 అడుగుల నీటిమట్టం ఉండేలా చూస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గతంలో తెప్పోత్సవం రోజున మాత్రమే గజఈతగాళ్లను అందుబాటులో ఉంచగా నెలరోజులు కార్తీకమాసం పుణ్యస్నానాలు పంపాలో చేస్తారనే ఉద్దేశ్యంతో నెలరోజులు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్‌సరఫరా నిరంతరాయంగా ఉండాలని, లూజు కలెక్షన్‌లు సరిచేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొండపైన రెండుచోట్ల, కొండదిగువన ఒకచోట 24 గంటలు అందుబాటులో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని వైద్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. 108 వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. గ్రామంలో శానిటేషన్ నిర్వహణపై తమకు గతేడాది మాదిరిగా అదనపు పారిశుధ్య సిబ్బందిని కేటాయిస్తే కొండదిగువ పారిశుధ్య బాధ్యతలు తీసుకుని ఎక్కడా ఇబ్బందిలేకుండా చూస్తామని సర్పంచ్ కుమార్‌రాజా ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో తహశీల్దార్ తాతారావు, దేవస్థానం ఏఈవోలు, సూపరెంటెండ్‌లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అంతకముందు ఎమ్మెల్యే సత్యప్రభ స్వామిని దర్శించుకున్నారు.

కాల్వలో జారి పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ మూర్తి (ఫైల్)

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవరపల్లి మండలం బందపురం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణమూర్తి (60) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తాడిపూడి కాల్వలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మరణించాడు. మృతదేహాన్ని స్థానికులు పైకి తీసుకొచ్చారు. గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ట్రైనీ ఎస్ఐ దినేశ్ తెలిపారు. సత్యనారాయణ మూర్తి కుమారుడు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పిఠాపురంలో వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్య చేసి ఉంటారని అనుమానాలు



పిఠాపురం శివారు పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం

పిఠాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించాడు. అతడిని హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆర్వోబీ సమీపంలోని పంట పొలాల్లోకి బుధవారం ఉదయం వచ్చిన రైతులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ ఎస్ఐ మణికుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది మద్యం తాగినట్టు ఆధారాలు గు ర్తించారు. మరణించిన వ్యక్తి మృతదేహం ముఖ ంపై ఉన్న గాయాల ఆధారంగా మద్యం మత్తు లో రాయితో కొట్టి హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. అక్కడ మృతుడి సెల్‌ఫోన్ లభ్య మైంది. ఫోన్ లాక్ చేసి ఉండడంతో దానిని తెరిచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. వయసు 35-38 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సత్యదేవుడి నమూనాలయం వద్ద హైమాస్ట్ లైట్ల ప్రారంభం

అన్నవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం వద్ద బుధవారం సాయంత్రం సుమారు రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ హైమాస్ట్ లైట్లను తుని ఎమ్మెల్యే దివ్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వీటి వల్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని, ఆలయం దేదీప్యమానంగా వెలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణ తదితరులు పాల్గొన్నారు.



లైట్లను ప్రారంభిస్తున్న తుని ఎమ్మెల్యే దివ్య

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నత్తల నిర్మూలనకు చర్యలు: కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆఫ్రికా నత్తల నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం సాయంత్రం ఉద్యానవన శాఖ పనులపై సమీక్ష సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నల్లజర్ల, కోరుకొండ, సీతానగరం, తాళ్లపూడి, అనపర్తి, రాజానగరం మండలాల పరిధిలో సుమారు 176 హెక్టార్ల ఉద్యానవన పంటలపై ఆఫ్రికా నత్తల ప్రభావం ఉన్నట్టు గుర్తించామన్నారు. నిమ్మ, బొప్పాయి, కూరగాయల పంటల్లో వ్యాప్తి చెందుతున్నాయని, కాని ఇప్పటివరకు పంటల ఉత్పత్తిపై ప్రభావం లేదని ఉద్యానవన శాఖాధికారులు వివరించారన్నారు. నత్తల నివారణకు ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో వివిధ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నత్తలను సేకరించి ఉప్పు ద్రావణంలో వేయడం, కాపర్ సల్ఫేట్ ద్రావణాలను పిచికారీ చేయడం, మెటా డీఎస్ మందును పొలాల్లో వేయడం ద్వారా నివారించవచ్చన్నారు. జిల్లాలో 1,32,101 ఎకరాల్లోని ఉద్యానవన పంటలకు ఈ-పంట నమోదు పూర్తయిందని, మిగతా నమోదును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 6వేల హెక్టార్లకు గాను ఇప్పటివరకు 4246 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్‌కు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు.

పెండింగ్ సమస్యలు సత్వరమే పరిష్కరించండి

ఆర్డీవో కృష్ణనాయక్.. రాజానగరం తహశీల్దార్ కార్యాలయం సందర్శన


కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజానగరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ అధికారులకు ఆదేశించారు. రాజానగరంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి, కార్యాలయంలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మ్యుటేషన్, ఎఫ్-లైన్స్‌కు సంబంధించిన ఐవీఆర్ఎస్ కాల్స్ ఆడిట్‌ను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్షన్ సంబంధిత పెండింగ్ క్లైయిమ్స్, అబ్జెక్షన్స్ పరిష్కారం, బీఎల్‌వోల నియామకాలు, ఎస్ఐఆర్‌ఈ-రోల్ మ్యాపింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని తహశీల్దార్ జి.సత్యవతిదేవికి, సిబ్బందికి ఆర్డీవో సూచించారు.

పుణ్యక్షేత్రంలో వన్యప్రాణి వారోత్సవ ర్యాలీ

దివాన్‌చెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌కు నో చెప్పండి పర్యావరణానికి మేలు చేయండి అని నినదిస్తూ రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో బుధవారం పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా తొలుత ర్యాలీ జరిపారు. అనంతరం జరిగిన సమావేశంలో పాల్గొన్న జీవ వైవిధ్య మండలి రీజనల్ కోఆర్డినేటర్ వి.సత్యప్రసాద్, విశ్రాంత డీఎఫ్‌వో ఎల్.భీమయ్య మాట్లాడుతూ పుణ్యక్షేత్రంలోని ఊరచెరువు గట్టుపై ఆవాసం ఏర్పరచుకున్న నత్తకొట్టు కొంగజాతికి చెందిన పక్షులను సంరక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల ఆవశ్యకత మానవ మనుగడకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌వో వి.పద్మావతి, ఎఫ్‌బీవో జీవీ రంగారావు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గోకవరం హైస్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీలో ఫుడ్ కమిషన్ సభ్యులు


విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న లక్ష్మీరెడ్డి

గోకవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఈ.లక్ష్మీరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరు తెన్నులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల నుంచి ఆహార నాణ్యత అడిగి తెలుసుకున్నారు.కూరలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఇవ్వడంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో రేషన్ దుకాణాన్ని సందర్శించి బియ్యం నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి శుభ్రత, పిల్లలకు అందించే ఆహారం, రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు.

భారీ అన్నసమారాధనలు

ఆలయాలకు అధిక మొత్తంలో విరాళాలు అందించిన కంబాల శ్రీనివాసరావు


గోకవరంలో అన్నసమారాధనలో పాల్గొన్న శ్రీనివాసరావు

గోకవరం/కోరుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శరన్న వరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం గోకవరంలోని దేవీచౌక్, కోరుకొండలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని, భక్తులకు తీర్థ ప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు గోకవరంలో జరిగిన ఉత్సవాలకు లైటింగ్ నిమిత్తం రూ.10 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వంట మనుషులకు, క్యాటరింగ్ సిబ్బందికి రూ.10 వేలు చొప్పున, పంచాయతీ సిబ్బందికి రూ.5 వేలు ఆయన సొంతంగా అందజేశారు. అలాగే కోరుకొండలో ఆలయానికి రంగులు వేసేందుకు, దసరా ఉత్సవాలకు రూ.లక్ష నగదు, అన్న సమారాధనకు టన్ను బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిఒక్కరు పరిరక్షించుకోవాలని సూచించారు. అలాగే రాజానగరం మండలం నందరాడ గ్రామంలోని దేవి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయానికి రంగులు వేయించడానికి రూ.1 లక్ష నగదు, అన్నసమారాధనకు 400 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు.కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభిరామ్ వ్యాఖ్యలపై అధిష్టానానికి ఫిర్యాదు!

టీడీపీ నాయకులు


టీడీపీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోరుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు అభిరామ్ ఇటీవల మీడియా సమావేశాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరిపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద మూడు మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీవీఆర్‌పై అభిరామ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షంతో పోరాడాల్సింది పోయి సొంత పార్టీలో నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులు గురి చేయడాన్ని వ్యతిరేకించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోరు కొండలో జరిగిన బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు బీవీఆర్ చౌదరి నియోజకవర్గానికి పార్టీ నాయకుడిగా ఉంటారని, ఆయనకు మీరంతా అండగా నిలవాలని ఆదేశించారని, దాని ప్రకారమే తామంతా పని చేస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగకేశవరావు,గంగిశెట్టి చంటిబాబు, వలవల రాజా, మళ్ల అప్పల నర్సారావు, సర్పంచ్ శశికళ, కరుటూరి విశ్వనాథం, కాండ్రు శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, చిటికెన కిరణ్‌కుమార్, అడపా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం అప్రజాస్వామికం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవళంపేటలో దుండగులు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిల్చారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ బుధవారం రాత్రి ఓ ప్రకటనలో అన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు పరిరక్షణలో ముందుండే టీడీపీ సమాజంలో శాంతి, సామరస్యానికి భంగం వాటిల్లే ఇటువంటి చర్యలను సహించదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల ఆత్మగౌరవాన్ని వీధి పాలు చేస్తూ వైసీపీ కపట నాటకాలతో జాతి సమైక్యతను దెబ్బతీస్తోందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని ప్రభుత్వం వదిలిపెట్టదని నిందితులపై, సూత్రదారులపై కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు చర్యలు

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» కడియం మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం


కడియంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మార్పులు చేసి నిరక్షరాస్యతను నిర్మూలించే విధంగా నూతన విధానాలతో ప్రభుత్వం ముందుకెళుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం ఆయన మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. కడియం ఉన్నత పాఠశాలలో నిర్మించే సైన్సు బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే కడియపుసావరంలో ఆర్‌కే అపార్ట్‌మెంట్ వద్ద నిర్మించే డ్రైనేజీకి భూమి పూజ చేసి గ్రామంలో కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డును, బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ స్వీయ నిధులు రూ.2 లక్షలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. సర్పంచ్ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కడియం ఉన్నత పాఠశాలలో మరికొన్ని సదుపాయాలు కల్పించేందుకు, జూనియర్ కళాశాల నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో పలు సమస్యలను హెచ్‌ఎం టి.సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రూ.10 లక్షలతో అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కడియపుసావరం రోడ్డు గుంతలు పడి ఉందని, రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

చేతి వృత్తుల వారి సంక్షేమానికి కృషి

చేతివృత్తుల వారి సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. వీరవరం కమ్యూనిటీ భవనంలో జరిగిన కుమ్మరి శాలివాహన సంఘం సమావేశానికి ఆయనను విచ్చేసి మాట్లాడుతూ చేనేత, శాలివాహన, వడ్రంగి, తదితర చేతి వృత్తుల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, వారి వృత్తుల్లో మరింత ప్రావీణ్యం పొందేలా సాంకేతిక శిక్షణ అందిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గోరంట్లతోబాటు శాలివాహన సంక్షేమ, అభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన దాలిపర్తి వేమన, పండూరి అప్పారావు, విజయకుమారిలను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, సర్పంచ్‌లు మోసిగంటి సత్యవతి, అన్నందేవుల చంటి, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, ముద్రగడ జమీ, పాటంశెట్టి రాంజీ, ఆదిమూలం సాయిబాబా, బొర్సు సుబ్రహ్మణ్యం, చిట్టూరి అమ్మిరాజు, వరగోగుల వెంకటేశ్వరరావు, బొర్సు సుబ్రహ్మణ్యం,వరగోగుల సత్యనారాయణ, దేవళ్ళ రామ్మోహనరావు, సూరపురెడ్డి జానకీరామ్, గారపాటి సత్యవతి, శాలివాహన సంఘం నాయకులు దాలిపర్తి భీమేశ్వరరావు, మాగాపు శ్రీను, గాది శేఖర్, మంతెన శ్రీనివాస్, మానేపల్లి కపిలేశ్వరరావు, పేరూరి గంగాధరం, ఆకివేటి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యాలు పెంచుకోవాలి

కేపీఎంజీ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ పార్టనర్, లీడర్ రామస్వామి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రాజానగరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ రంగంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేపీఎంజీ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ పార్టనర్, లీడర్ నారాయణన్ రామస్వామి పిలుపునిచ్చారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ మాక్వారీ విశ్వవిద్యాలయం, కేపీఎంజీ ఇన్ ఇండియా సంస్థలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటి విద్యా భాగస్వామిగా ఉన్న జీజీయూలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రానున్న నాలుగేళ్లలో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతాయని, విద్యార్థులు ఆ దిశగా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. జీజీయూ ప్రొ ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగవకాశాలు పెరుగుతున్నాయన్నారు. భారతదేశం సాంకేతిక రంగంలో విప్లవాత్మక పరివర్తన దిశగా పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో వీసీ యు.చంద్రశేఖర్, కేపీఎంజీ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ టెక్నికల్ డైరెక్టర్ మహావీర్ అగర్వాల్, ఎండీ సుమంత్ పాలేపు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు బి.సుజాత, తమిళ్‌కోడి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం.. ఓట్ల దొంగ

పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేడీ శీలం, ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ పాలక్‌వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడిందని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేడీ శీలం ఆరోపించారు. రాజమహేంద్రవరం కృష్ణసాయి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లా అనుబంధ సంఘాల కమిటీలతో బుధవారం జరిగిన అత్యవసర సమావేశానికి శీలంతోపాటు ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ పాలక్‌వర్మ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. తొలుత జరిగిన విలేకరుల సమావేశంలో జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రం బీహార్‌లో 60 లక్షల ఓట్లు తొలగించిందని, కర్నాటకలో 6 వేలు ఓట్లు తొలగించారన్నారు. నకిలీ ఓట్లు నమోదు చేశారన్నారు. ఈ దొంగ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల సంఘం చేష్టలూడి చూస్తోందని ధ్వజమెత్తారు.లోపాలపై ఈసీని కాంగ్రెస్ నిలదీస్తే మౌనం వహిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన ఓట్ చోర్ గద్దె చోడ్ నినాదంతో తూర్పుగోదావరి జిల్లాలో లక్ష సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. పాలక్‌వర్మ మాట్లాడుతూ ముగ్గురు బడా వ్యాపారుల కనుసన్నల్లో కేంద్ర ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా ఓట్లు తొలగించిన అధికారులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు.వారిని కండువాలతో విశ్వేశ్వరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత పేపరు మిల్లు గేటు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళ్ళర్పించారు.సమావేశంలో నాయకులు అరిగెల అరుణకుమారి, మార్టిన్ లూథర్, బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్, బేగ్, డాక్టర్ వడయార్, ఎం.శారద పాల్గొన్నారు.

తొర్రేడులో పారిశుధ్య సిబ్బందికి ఘన సత్కారం


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడు గ్రామ సచివాలయం-1లో పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక హెల్త్ క్లినిక్ వద్ద 12 మంది గర్భిణులకు సామూహి సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్, చిట్టూరి శ్రీధర్, కొత్తపల్లి సత్యనారాయణ, మొఖమాటి యోహన్ రాజు, సొసైటీ అధ్యక్షుడు దండమూడి బాపినీడు, దాసరి రామచంద్రరావు, దండమూడి వెంకటేశ్వరరావు, దాసరి గురుప్రసాద్, యువగళం టీం సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో పన్ను సంస్కరణలు

అవగాహన సదస్సులో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ


సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 ద్వారా పన్ను విధింపులో ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందని వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య, అర్థశాస్త్ర శాఖల ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 అనే అంశంపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ గృహ, వ్యవసాయ, విద్య, నిర్మాణ అవసరాలపైనా, పరిశ్రమలకు, ఇతర రంగాలకు జీఎస్టీ 2.0 వల్ల అనేక లాభాలు కలుగుతాయన్నారు. వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు పి.షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి, ఆర్థిక వృద్ధి వేగవంతం కావడానికి జీఎస్టీ సంస్కరణలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో వాణిజ్యవిభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అన్నపూర్ణ, జీఎస్‌టీ 2.0 నిర్వాహకులు వీవీవీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మరచి విమర్శలు చేయడం దారుణం

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వాళ్ల స్థాయి మరచి బూతులతో విమర్శలు చేయడం దారుణమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు విమర్శించారు. బుధవారం రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ సెంటర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో జోడుగుర్రాల స్వారీ చేస్తుంటే వైసీపీ వాళ్ల బూతులతో స్వారీ చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి పేర్ని నాని లాంటి వాళ్ల కూడా గాడి తప్పుతున్నారన్నారు. రాష్ట్రంలో అప్పులు ఎలా తెస్తారు, ఏం జరుగుతుంది, ఎలా వినియోగిస్తారు అనే విషయాలు ఐదేళ్ల ప్రభుత్వం నడిపిన జగన్మోహనరెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు.స్టీల్‌ప్లాంటుకు రూ.11,000 కోట్లకు రూ.8,000 కోట్లు రిలీజ్ చేశామన్నారు. 11 అసెంబ్లీ సీట్లు ఎందుకు వచ్చాయనేది ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వైసీపీ హయాంలో లిక్కర్ తయారీదారుగా ఉన్న వ్యక్తి పొరపాటున తెలుగుదేశంలో చేరి అదే ఒరవడి కొనసాగించడంతో ఎట్టకేలకు గుర్తించడం జరిగిందని, ఇది కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధంలేదని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ మాట్లాడుతూ స్వదేశీ వస్తువులనే వినియోగించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు అందరూ దేశంలో ఉత్పత్తి చేసిన వాటినే వినియోగించాలని అన్నారు.

'నిడదవోలు'లో భారీ వర్షం

నిడదవోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణం, మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా వేసవిని తలపించేలా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. సుమారు గంటపాటు పడింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజానగరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లకు వార్షిక మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ బుధవారం తెలిపారు. దీని కారణంగా రాజానగరం, సూర్యారావుపేట, ఇండస్ట్రియల్ ఫీడర్, గైట్ కళాశాల, నన్నయ యూనివర్శిటీ, రాజమహేంద్రవరం పేపర్ మిల్, బ్రిడ్జి కౌంటీ, తూర్పుగోనగూడెం, పల్లకడియం, రామస్వామిపేట, ఐశ్వర్యరైస్ మిల్, లెనోరా డెంటల్ కళాశాల, క్వారీ, సాక్షి ముద్రణా కార్యాలయం, ఐఎస్‌టీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

కొత్తపల్లిలో మందుగుండు సామగ్రి స్వాధీనం

గోకవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని బుధవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని కొత్తపల్లిలో లైసెన్స్ లేకుండా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచినట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో సుమారు రూ.40,000 విలువైన మందుగుండు సామాన్లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో ట్రైనీ ఎస్ఐ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు మనసును ఆధీనంలో ఉంచుకోవాలి

కఠిన చీవర దానంలో భంతేజీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మనసును ఆధీనంలో ఉంచుకోవడం ద్వారా చెడు కోరికలను విస్మరించి ప్రశాంతతను సాధించవచ్చని భంతేజీ అన్నారు.రాజమహేంద్రవరం గోదావరి బండ్‌పై ఉన్న పూలే అంబేడ్కర్ భవనంలో బుధవారం రాత్రి కఠిన చీవర కార్యక్రమం జరిగింది. దీనికి మైత్రేయ బుద్ధ విహార్ భంతే పూజ్య అనాలయో విచ్చేశారు. ఈ సందర్భంగా ధమ్మ ప్రచారంలో ప్రవచించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఉన్నత జీవన విధానమని అన్నారు. అనంతరం పాల్గొన్న వారంతా భంతేజీకి చీవార దానం చేశారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ రాజమండ్రి నిర్వహకులు సీహెచ్ సుబ్బారావు, నయనాల కృష్ణారావు, మర్రి బాబ్జి, డీఎంఆర్ శేఖర్, కేకే సంజీవరావు, ఐతాబత్తుల కామేశ్వరరావు, పి.పావన ప్రసాద్, కడియాల గోపాలకృష్ణ, మార్గాని చంటిబాబు, అప్పారి జయప్రకాష్, కొంకి రమేష్, పీఎఫ్ రవి, పితాని సత్యనారాయణ, డాక్టర్ కేవీ రమణ, కడలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో స్మార్ట్ ఫీచర్ పార్క్

ప్రారంభంలో ఎమ్మెల్యే వాసు


పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్మార్ట్ ఫీచర్ పార్కును రాజమహేంద్రవరంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలో నిర్మించిన బుధవారం స్మార్ట్ ఫీచర్ పార్కును ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ బాక్స్‌తో కూడిన ఈ పార్క్‌లో వెలుగులు యాప్ ఆధారితంగా ఏర్పాటు చేశామన్నారు.నగరంలోని పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో నగరాల సుందరీకరణ చేయాలన్నది లక్ష్యమని, అందులో భాగంగా ఎమ్మెల్యే వాసు 30 పార్కులను అభివృద్ధి చేసి అన్ని ప్రాంతాల వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

దొంతమూరులో ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవం

రంగంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది కార్యక్రమాలను మండలంలోని జి.దొంతమూరులో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సోడసాని ప్రసాద్, దుప్పలపూడి సుబ్రహ్మణ్యం,శెట్టి వీరబాబు, వీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దాపురం ఖండ సంఘ చాలక్ బిక్కిన సాయి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ వ్యక్తి నిర్మాణం ద్వారా సమాజంలో దేశభక్తి భావనను నిర్మాణం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ విజయదశమికి శతాబ్దిలోకి అడుగుపెట్టిందని పేర్కొన్నారు. మైలవరపు సాయిరామ్ మాట్లాడుతూ కార్యక్రమాలు ఈ నెల 11న సింగంపల్లి, 12న రంగంపేటలో నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో మండవిల్లి గుప్తా, పి.రామచంద్రరావు, ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.


అమ్మవార్ల ఊరేగింపు

దేవరపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లోని సౌభాగ్య దుర్గాంబిక, పల్లపువీధి రామాలయంలోని కనకదుర్గమ్మవార్లని గ్రామ పురవీధుల్లో బుధవారం ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీకుమారి
సూర్యప్యాలస్	: కాంతారా-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా-1
మేనక	: ఇడ్లీ కొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా-1
అశోక	: ఇడ్లీ కొట్టు
వీఎస్ మహల్(నామవరం)	: మిరాయ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కాంతారా-1, ఓజీ
వెంకటసూర్య(కడియం)	: ఓజీ
సత్యగౌరి (అనపర్తి)	: ఓజీ
సూర్యశ్రీ (అనపర్తి)	: కాంతారా-1
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కాంతారా-1, ఓజీ
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కాంతారా-1
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓజీ
లలితామహాల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు





విస్ఫోటనంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఓదారుస్తున్న బంధువు

మహా.. విషాదం



బాణసంచా తయారీకేంద్రంలో అగ్నికీలలు..
చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు..

కన్నీళ్లు పెట్టుకుంటున్న కేంద్రం యజమాని కుమారుడు చిట్టిబాబు







వీఎస్ఎన్ మూర్తి | పి.వెంకట రమణ | పాకా అరుణ







కుడుపూడి జ్యోతి | పెంకే శేషారత్నం | చిట్టూరి శ్యామల



కళ్లెదుట ఎగసిపడుతున్న మంటలు.. ఎటు చూసినా కాలిపోయి నిర్జీవంగా పడి ఉన్న మృతదేహాలు.. మరోవైపు సగం కాలిన క్షతగాత్రుల ఆర్తనాదాలు.. ఇంకోవైపు బాధిత కుటుంబీకుల ఏడుపులు.. చెల్లాచెదురుగా కాలి బూడిదైన బాణసంచా.. ఎటు చూసినా భీతావహ దృశ్యాలు... ఇదీ రాయవరంలో బుధవారం జరిగిన మహా విషాదం.. బాణసంచా తయారీకేంద్రంలో మంటలు ఎగసిపడి ఏడుగురు మృత్యువాతపడ్డారు.. మరో ముగ్గురు ఒళ్లంతా కాలిన గాయాలతో క్షతగాత్రులుగా మారిపోయారు. ఉదయం వెళ్లొస్తాం అంటూ ఇంటి నుంచి పనికి వెళ్లినవాళ్లు అటు నుంచే తరలిరాని లోకాలకు వెళ్లిపోయారు.. చివరి చూపు కూడా దక్కనంతగా మృతదేహాలు కాలిపోయాయి.. అవి చూసిన కుటుంబీకుల కన్నీళ్లు మిన్నంటాయి.. వెళ్లొస్తాం అన్నారు.. ఇలా చేశారేంటి.. ఇక మాకు దిక్కెవరంటూ మృతదేహాలను చూస్తూ బోరున విలపిస్తున్నారు.. క్షతగాత్రుల బంధువుల మా వాళ్లను కాపాడండంటూ వైద్యులను వేడుకుంటున్నారు.

బాణసంచా పేలుడు.. ఏడుగురు సజీవదహనం

- ఉలిక్కిపడ్డ రాయవరం
- భోజన సమయంలో ప్రమాదం
- పేదల బతుకులపై ఫైర్
- అక్కడికక్కడే ఆరుగురి మృతి
- చెల్లాచెదురుగా మృతదేహాలు
- ఆసుపత్రిలో మరొకరు
- హృదయ విదారకంగా కేంద్రం
- హోం మంత్రి అనిత పరామర్శ

అమలాపురం/మండపేట/రాయవరం, అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెలుగులు విరజిమ్మాల్సిన బాణసంచా.. కొందరి కుటుంబాల్లో చీకటిని నింపింది. బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ఘోర విస్ఫోటనంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. వారిలో నలుగురు మహిళలు, బాణసంచా కర్మాగారానికి చెందిన యజమాని ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం-కొమరపాలెం ప్రధాన రహదారిని ఆనుకుని రాయవరం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ ఈ విస్ఫోటనం సంభవించినట్టు సమాచారం. ఈ విస్ఫోటనం సమీప ప్రాంతాల్లోని ఇళ్లల్లో సైతం ప్రకంపనలు సృష్టించింది. బాణసంచా కర్మాగారం నుంచి భారీగా శబ్దాలతో పాటు దట్టమైన పొగలు ఆకాశాన్నంటాయి. దాంతో స్థానికులంతా భయభ్రాంతులకు గురయ్యారు.

అంతటా ఆర్తనాదాలే...

శ్రీలక్ష్మీ గణపతి బాణసంచా గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో రోజుకు 40 మంది వరకు పనిచేస్తారు. ఈ సంస్థ 93 ఏళ్ల నుంచి బాణసంచా తయారీలో పేరొందింది. ప్రతి ఏడాది దీపావళికి పెద్ద ఎత్తున బాణసంచా తయారుచేస్తారు. ఈ ఏడాది అదే విధంగా భారీఎత్తున బాణసంచా తయారీ చేస్తుండగా బుధవారం భారీ పేలుడు సంభవించింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. భోజన సమయంలో పది మంది బయటకువెళ్లగా, మరో 10 మంది తయారీ కేంద్రంలో యజమానితో సహా ఉన్నారు. భారీ పేలుడు, మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో మందుగుండు తయారీ చేసే కేంద్రం పైకప్పుకూలిపోయింది. ఈ పేలుడు ధాటికి మందుగుండు సామగ్రి స్టాక్ పాయింట్ కూడా నేలకూలింది. కూలీలను రక్షించే ప్రయత్నంలో యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి అలియాస్ సత్తిబాబు మంటల్లో చిక్కుకుని కూలీలతో సహా సజీవదహనం అయ్యాడని చెబుతున్నారు. మృతుడు చేతికి ఉన్న ఉంగరాన్ని బట్టి మృతదేహాన్ని సత్తిబాబుగా గుర్తించారు. సంఘటనా స్థలంలో నేల కూలిన షెడ్డు, చెల్లాచెదురుగా మృతదేహాలు పడి ఉన్నాయి. సంఘటనా జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సంస్థ యజమాని సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిబంధనలు పాటించే సత్తిబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బాణసంచా తయారీ కేంద్రాల గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.ఇదే వృత్తిలో కొనసాగుతూ మందుగుండుకు బలికావడంతో సత్తిబాబు కుటుంబీకులు స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ దిగ్భ్రాంతి

బాణసంచా విస్ఫోటన ఘటన తెలిసిన వెం టనే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఇక్కడకు చేరుకున్నారు. ఏడుగురి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.



హోం మినిస్టర్ అనితకు వివరాలు చెబుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కలెక్టర్ మహేష్‌కుమార్

మృతులు వీరే...

ప్రమాదంలో నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు మరణించారు.బిక్కవోలు మండలం కొమరిపాలెంనకు చెందిన ఫైర్స్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి (68) అలియాస్ సత్తిబాబు ఉన్నారు. కార్మికులు పాకా అరుణ (33)(సోమేశ్వరం), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50) ఘటనా స్థలంలోనే గుర్తు పట్టలేని రీతిలో సజీవ దహన మయ్యారు. బిక్కవోలు మండలం కొమరపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విస్ఫోటనం జరిగిన ప్రదేశంలో 12 మంది ఉండగా, 10 మంది మంటల్లో చిక్కుకుపోగా ఇద్దరు మాత్రం పక్కనే ఉన్న పంట పొలంలోకి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. మూడు పశువులు గాయపడగా స్థానిక పశువుల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



బాణసంచా కేంద్రం నుంచి మృతదేహాల తరలింపు.. పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో దేవరకొండ అఖిల

ఎమ్మెల్యే తనయుడి వాహనంలో తరలించినా..



ప్రమాద సమాచారం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన తనయుడు టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలిన గాయాలతో నరకయాతన అనుభవిస్తున్న కొమరిపాలెం గ్రామానికి చెందిన పొట్నూరి వెంకటరమణను మనోజ్‌రెడ్డి వాహనంలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ అనపర్తిలో ఒక ఫైనాన్స్ వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తాడు. ఖాళీ సమయాల్లో కేంద్రానికి వస్తుంటాడు.. బుధవారం కూడా అలాగే వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడలో చికిత్స పొందుతూ మరణించాడు. ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రమాద స్థలం నుంచే సీఎం చంద్రబాబుకు ఇక్కడి పరిస్థితిని ఫోన్ ద్వారా వివరించారు.

చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ఘటన : ఐజీ



చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ఫ్రెజర్ పెరిగి నిప్పు రవ్వలు ఎగసిపడడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్టుగా భావిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ చెప్పారు. రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌కు 2026 మార్చి వరకు బాణసంచా తయారీ అనుమతి ఉందన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తరువాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

భయపడి పరుగు తీశాం..



బాణసంచా తయారు చేసే కేంద్రంలో తరచూ తయారీదారులు మందుగుండు కాల్చడం ట్రైల్ రన్ వేస్తుంటారు. అలాంటిదే బుధవారం రాయవరంలో జరిగి ఉండొచ్చు. భోజన సమయంలో చూస్తుండగానే భారీ శబ్దాలతో కూడిన మంటలు వ్యాపించాయి. మా ఇంటి వద్ద భోజనం చేసే సమయంలో ఈ సంఘటన జరగడంతో కుటుంబమంతా పరుగులు తీశాం.

- గులిపే కృష్ణవేణి, ప్రత్యక్ష సాక్షి



ధ్వంసమైన షెడ్



ప్రమాదంపై ఐజీ అశోక్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అటెన్‌షన్ ప్లీజ్.. 2వది!

అమలాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది రోజుల్లో రెండో ప్రమాదమిది. గత నెల 30వ తేదీ మంగళవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసలో బాణసంచా పేలుడు జరిగింది. కిరాణా వ్యాపారం నిర్వహించే ఇక ఇంటి వద్ద నిల్వ ఉన్న బాణసంచాను అటకపై నుంచి దించుతుండగా ప్రమాదశాత్తూ పేలి దంపతులు కంచర్ల శ్రీనివాస్ (50), భార్య సీతామహలక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందారు. భవనమంతా ఛిద్రమై నేలమట్టమైంది. ఇప్పుడిది.

10 మందిని కాపాడిన ఫంక్షన్

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రాయవరం- కొమరిపాలెం శివారులో ఉన్న ఈ బాణసంచా కర్మాగారంలో పనిచేసేందుకు గత మూడు నెలలుగా 16 మంది మహిళలు అనపర్తి, అనపర్తి సావరం నుంచి రోజువారీ వెళుతున్నారు. బుధవారం కూడా 16 మంది పనికి వెళ్లాల్సి ఉండగా, వీరిలో పదిమంది సావరంలో శుభకార్యంలో పాల్గొనాల్సి రావడంతో ఆరుగురు మాత్రమే పనికి వెళ్లారు. దాంతో మిగిలిన వారంతా ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లైంది. మూడు నెలలుగా ఒకేచోట పనిచేస్తూ కలిసి వెళ్లి వచ్చే వారిలో ముగ్గురు లేరన్న వార్తతో విషాదంలో మునిగిపోయారు.

వందేళ్ల నుంచి తయారీ

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం, బిక్కవోలు సామర్లకోట మండలం జి.మేడపాడు పరిసర ప్రాంతాల్లో బాణసంచా తయారీ శతాబ్ది కాలంగా కొన్ని కుటుంబాలకు ఆనవాయితీగా వస్తోంది. కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల కుటుంబానికి బాణసంచా తయారీకి పెట్టింది పేరు. ఇక్కడి నుంచి బాణసంచా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకే కాకుండా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ఎగుమతి జరిగేవి. రాజకీయ పార్టీల విజయోత్సవాలకు, టీడీపీ మహానాడుకూ ఇక్కడ నుంచే మందుగుండు సామగ్రిని తరలించేవారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు వీరికి అనేక పర్యాయాలు సత్కారం చేశారు.

కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా నాయుడు బాధ్యతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా పి.నాయుడు నియమితులయ్యారు.ఆయన ఇప్పటి వరకూ రుడాకు పనిచేశారు.ఇక్కడ సీపీగా పనిచేసిన కోటయ్య బదిలీ కాగా ఆయన స్థానంలో నాయుడిని నియమించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఫుడ్ కమిషన్ సభ్యుడి ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో ఫుడ్ కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కోరుకొండ, గోకవరం, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ మండలాల్లోని హాస్టళ్లు, పాఠశాలలు, రేషన్ షాపులు,అంగన్వాడీలను పరిశీ లించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.గోకవరం జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం లేకపోవడంతో హెచ్ఎంకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సూచించారు. గురువారం కొవ్వూరు డివిజన్‌లో పర్యటి స్తారని డీఎస్‌వో వి.పార్వతి తెలిపారు.

నేటి నుంచి బాణసంచా యూనిట్లు తనిఖీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ ప్రకియను రెండు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయాలని యజమానులు, నిర్వాహకులను జేసీ వై.మేఘ స్వరూప్ ఆదేశించారు.జేసీ చాంబర్ నుంచి ఆయన అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయవరంలో బుధవారం జరిగిన ప్రమాదం నేపథ్యంలో జిల్లాలోని బాణసంచా తయారీ, విక్రయ యూనిట్ల వద్ద భద్రతను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఆయా బృందాలు గురు, శుక్రవారాల్లో యూనిట్లను పరిశీలిస్తాయని తెలిపారు. తనిఖీ బృందాలు వచ్చే సమయానికి సంబంధిత పత్రాలు, వివరాలు సిద్ధంగా ఉంచాలని, భద్రత ప్రమాణాలకు సంబంధించిన న్ని వివరాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. బాణసంచా తయారీదారులు, విక్రయదారులు రెవెన్యూ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫైర్, పోలీసుశాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీచేయాలన్నారు.

దివ్యాంగత్వం పునఃపరిశీలనకు శిబిరాలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద దివ్యాంగుల పునఃపరిశీలన తర్వాత కొందరు దివ్యాంగుల వైకల్య శాతం తగ్గినట్లు గుర్తించడం జరిగిందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీంతో అప్పీలు చేసుకున్న వారికి మళ్లీ పరీక్షలు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రులు, అనపర్తి ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపులను నిర్వహించి దివ్యాంగత్వ ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2231 మంది అప్పీలు చేసుకున్నారన్నారు. రోజుకు.. దివ్యాంగత్వం(లోకోమోటివ్) ఉన్న 30, చెవిమాంద్యం 30, కంటి చూపు మాంద్యం 20, మానసిక లోపం 20 మందికి వైద్య పరీక్షలు చేస్తారన్నారు.అప్పీలు చేసుకున్నవారు కేటాయించిన తేదీల్లో ఆసుపత్రులకు హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్,రమణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలేదని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.విద్యాసాగర్, డీవీ.రమణ అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో జరిగిన తూర్పుగోదావరి జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ, డీఏలు,జీపీఎఫ్‌లు, సరెండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందన్నారు.వాటిని నిలదీస్తే అక్రమ కేసులు బనాయించారన్నారు. హెచ్ఆర్ఏని 4 శాతం తగ్గించి ఉద్యోగులే తమకు వేతన సవరణ వద్దు పాతజీతాలే ఇవ్వండనే పరిస్థితికి కల్పించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెలనెలా 1న జీతాలు వస్తున్నాయన్నారు.గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు 80 శాతం వరకు ఎత్తివేసిందన్నారు. జీపీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, సీపీఎస్ కంట్రిబ్యూషన్‌లో రూ.10 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో 11 వేల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో 3 వేల మందిని క్రమబద్ధీకరించారని మిగిలిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. రాష్ట్రంలో 12లక్షల 30వేల మంది ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జేఏసీ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులు శ్యామల సెంటర్ నుంచి ఆనం రోటరీ హాలు వరకు భారీ ర్యాలీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎన్జీవో సంఘం నాయకులు పసుపులేటి శ్రీనివాస్,జగదీశ్వరరావు,రాజ్యలక్ష్మి, జానకి పాము, శ్రీనివాస్, వేణుమాధవ్, రామారావు, జానకి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అడహక్ కమిటీ ఏర్పాటు

ఏపీఎన్జీవో సంఘం తూర్పుగోదావరి జిల్లా అడహక్ కమిటీ ఛైర్మన్‌గా మీసాల మాధవరావు ఎన్నికయ్యారు.కోఛైర్మన్‌గా ప్రవీణ్ కుమార్, కన్వీనర్‌గా అనిల్ కుమార్, సభ్యులుగా ఎం.సత్యనారాయణ రాజు, ఎన్.వెంకటేశ్వరావు, కె.నందీశ్వరుడు,ఎస్.వెంకటరమణ ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు , ఖజానా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.





చైర్మన్ రత్నకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

కొవ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా సీహెచ్.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో ఆర్వోగా పని చేస్తూ పదోన్నతిపై కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా వచ్చారు. పట్టణంలో ఏ సమస్య ఎదురైనా నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

పేదలకు నాణ్యమైన విద్యే లక్ష్యం : ఎమ్మెల్యే



నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడానికి ప్రభుత్వంతో పాటు దాతల సహకారం తీసుకుని ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ప్రభుత్వం మధ్యలో నిలుపుదల చేసిన తరగతి గదులను దాతల సహకారంతో ప్రారంభించిన పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని జూనియర్ కళాశాలలు, హైస్కూల్స్, ప్రభుత్వ ఆసుపత్రులను గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు పనుల పేరుతో అరకొర నిర్మాణాలు చేపట్టి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కే. విజయ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు

తాళ్లపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా టీడీపీయువ నేత అల్లూరి విక్రమాదిత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌ఎం రాధిక, పాఠశాల కమిటీ చైర్మన్ రాంబాబుతో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. నిడదవోలు రాజరాజేశ్వరి కంటి వైద్యశాల సిబ్బంది వచ్చి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. లయన్ దుగ్గిరాల సూర్యప్రకాశం, లయన్ మారిన రామ్మూర్తి, ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, కూచిపూడి గణపతి, జీ. రాంబాబు, కే. జాన్ బాబు, డా.నాగరాజు, శివ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై కార్యదర్శులతో సమావేశం



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశరావు

కొవ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ చేపట్టాలని మండల డిప్యూటీ ఎంపీడీవో బీహెచ్‌ఎస్ ప్రకాశరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం 16 గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యంపై సమావేశం నిర్వహించారు. ప్రకాశరావు మాట్లాడుతూ జిల్లా పంచాయితీ అధికారిని వి.శాంతామణి ఆదేశాల మేరకు పంచాయతీలలో ఇంటింటా చెత్త సేకరణ విధిగా చేపట్టాలన్నారు. ప్రజల నుంచి సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్లలో వర్మీ కంపోస్టు తయారుచేయాలన్నారు. దీని ద్వారా కొం త చెత్త సమస్య తీరుతుందన్నారు. తడి చెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా రచయిత అడవి బాపిరాజు జయంతి



బాపిరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పెరవలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ నవలా రచయిత, స్వాతంత్ర్య సమరవాది అడవి బాపిరాజు 130వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ముక్కామల శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడవి బాపిరాజు సాహిత్యంపై మక్కువ చూపేవారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

'నిడదవోలు'లో భారీ వర్షం

నిడదవోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణం, మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా వేసవిని తలపించేలా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. సుమారు గంటపాటు పడింది.

రవాణా శాఖ సేవలు చేరువ చేస్తాం

● గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ● దేవరపల్లిలో రవాణా శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఇతరులు

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ సేవలు ప్రజలకు మరింత చేరువ చేస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో బుధవారం నూతన రవాణాశాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు సంబంధించి రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని దేవరపల్లిలో ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో కొవ్వూరులో ఈ కార్యాలయం ఉండేదన్నారు. దీంతో వాహనాల రిజిస్ట్రేషన్స్, లైసెన్సులకు కొవ్వూరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రవాణా శాఖ కార్యాలయాన్ని అద్దె భవనంలో ప్రారంభించటం జరిగిందని తెలిపారు. దేవరపల్లి రవాణాశాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట్రమణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్ర మంలో ఆర్‌టీవో ఆర్.సురేశ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చినబాబు, ఉప్పులూరి రామారావు, ముళ్లపూడి దొరాజీ చౌదరి, సుంకర దుర్గారావు, పరిమి శ్రీరామకృష్ణ, చిలకా రాజేశ్, అబ్బిన సురేంద్ర, గద్దే రమాదేవి, మెంతిమి అమరావతి, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత



క్రీడా దుస్తులతో ఊనగట్ల హైస్కూల్ విద్యార్థులు

చాగల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు పూర్వ విద్యార్థి కే. సురేష్ కుమార్ (బాలు) ఆర్థిక సహకారంతో బుధవారం క్రీడాదుస్తులు అందజేశారు. 21 మంది క్రీడాకారులకు రూ. 12 వేలు విలువ గల వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ఎన్‌వీ రమణ మాట్లాడుతూ క్రీడల పట్ల ఉన్న అభిమానంతో గతంలో కూడా సుమారు రూ. 20 వేలు విలువ గల దుస్తులను ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా దాత సురేష్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ కామన శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

● ఎంపీపీ కాకర్ల నారాయుడు ● సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొవ్వూరు, చాగల్లు మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు క్లస్టర్ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజుల శిక్షణ తగతులను ఎంపీడీవో టీబీవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. మాస్టర్‌ట్రైనీలు జె.నరేంద్రబాబు, జీ.విమలాదేవి, వీ.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాలు, మండలాలకు సంబంధించి సుస్థిర అభివృద్ధి స్థానికీకరణపై పావర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, కొవ్వూరు, చాగల్లు మండలాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 9,10 తేదీల్లో దేవరపల్లి, తాళ్లపూడి మండలాలకు సంబంధించి క్లస్టర్ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై రెండు రోజుల శిక్షణ తగతులను నిర్వహించనున్నట్లు కొవ్వూరు ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించొద్దు

● పట్టణ సీఐ పీ.విశ్వం హెచ్చరిక



కొవ్వూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌ల అనుమతి లేకుండా ఎవరైనా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని పట్టణ సీఐ పీ.విశ్వం హెచ్చరించారు. బుధవారం పట్టణంలో బాణసంచా అమ్మకాలు, తయారీ కేంద్రాలపై పోలీసు తనిఖీలు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ చేసినా స్థానిక ప్రజలు 112 నెంబర్ లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

కాలువలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్ను కాలువలో మంగళవారం సాయంత్రం దూకిన మోర్తకి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని కొప్పుల పూజిత మృతదేహం బుధవారం సాయంత్రం లభ్యమయ్యింది. ఎస్ఐ డీ. రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. వంతెనపై నుంచి దూకిన ప్రాంతానికి సుమారు అర కిలోమీటర్లలోపు మృతదేహం దొరికింది. మృతురాలి తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

కేతా సాహెబ్ జన్మదిన వేడుక

చాగల్లు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరి కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడుతూ సర్పంచ్‌గా, ఎంపీపీగా, టీడీపీ నాయకుడిగా పనిచేశారన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకులు కే శ్రీను, పిల్లి సత్యనారాయణ, మల్లుల రమణ పాల్గొన్నారు.

'మానసిక దివ్యాంగులు ప్రత్యక్ష దైవాలు'



శంకరాపురంలోని హృదయాలయానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

నిడదవోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులు ప్రత్యక్ష దైవాలని, వారికి సహాయం చేయడం దైవసేవతో సమానమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ అన్నారు. బుధవారం శంకరాపురంలోని హృదయాలయానికి మానే వరలక్ష్మి పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులకు భోజన ఖర్చుల నిమిత్తం రూ. ఐదు వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మానెం రాంబాబు, అడ్డాల ప్రభాకర్, మారిశెట్టి అమ్మిరాజు, గోపిరెడ్డి శ్రీనివాస్, దారపు రెడ్డి ప్రతాప్ , తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడి అమానుషం

నిడదవోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసరడం భారత రాజ్యాంగ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలని బహుజన సమాజ్ పార్టీ నియోకవర్గ అధ్యక్షుడు బయ్యే మునీంద్ర అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని వీక్లీ మార్కెట్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటరు అయన మాట్లాడుతూ ఈ దాడులు ఆగాలంటే బహుజనులు పాలకులు కావడమే సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో అంబటి పుల్లారావు, తాడేపల్లి రాజన్‌బాబు, నేలకూరి రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు తాడిపూడి కాల్వలో పడి ఒకరి మృతి

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాడిపూడి కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు ఈ సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బంధపురం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణ మూర్తి (60) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తాడిపూడి కాల్వలో ప్రమాదవ శాత్తు కాలు జారి పడిపోయాడు. స్థానికులు మృతదేహాన్ని పైకి తీసుకొచ్చారు. పోస్టు మార్టం నిమిత్తం గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ట్రైనీ ఎస్సై దినేశ్ తెలిపారు. సత్యనారాయణ మూర్తి కుమారుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ



పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిం చాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్ 14, 17 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. దీన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన చైర్మన్ ఆదినారాయణ మాట్లా డుతూ విద్యార్థులకు క్రీడల ద్వారా శారీరిక మానసిక స్థైర్యంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో విజయం సాధించి పాఠశాలకు పట్టణానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, చెస్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో గణేష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం పి.రాజేశ్వరి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, ఫయాజ్, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ సతీష్ కుమార్, పాలేటి శ్రీనివాస్, బండి ప్రదీప్ పాల్గొన్నారు.

సత్యదేవుడి నమూనాలయం వద్ద హైమాస్ట్ లైట్ల ప్రారంభం



లైట్లను ప్రారంభిస్తున్న తుని ఎమ్మెల్యే దివ్య

అన్నవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం వద్ద బుధవారం సాయంత్రం సుమారు రూ. ఏడు లక్షలతో ఏర్పాటుచేసిన విద్యుత్ హైమాస్ట్ లైట్లను తుని ఎమ్మెల్యే దివ్య ప్రారం భించారు. ఆమె మాట్లాడుతూ వీటి వల్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని, ఆలయం దేదీప్యమానంగా వెలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రాకూడదు : ఎమ్మెల్యే

అన్నవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. బుధవారం అన్నవరం దేవస్థానంలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అజెండాలను చదివి వినిపించగా దానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై శాఖల అధికారులు లక్ష్యాలు నిర్దేశించారు. ఈనెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండగా నవంబరు 2న స్వామివారి తెప్పోత్సవం, 5న గిరిప్రదక్షిణ జరుగుతందని వీటితోపాటుగా ముఖ్యమైన పర్వదినాలు 15 రోజులుగా నిర్ధారించి ఆ రోజుల్లో 50 వేల నుంచి లక్షమంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తూ దానికణంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులు ఎక్కడా తోపులాటలు లేకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రధానంగా రూ. 300, 1000, 1500, 2000 వ్రతాల కోసం నిరీక్షించే భక్తులను ప్రత్యేక క్యూల ద్వారా ఆయా వ్రత మండపాలకు చేరుకుంటారని తెలి పారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా టూవీలర్లు, నాలుగుచక్రాల వాహనాలకు విడివిడిగా పార్కింగ్‌కు నిర్దేశించామన్నారు. టూవీలర్స్ పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద, నాలుగు చక్రాల వాహనాలు సత్యగిరి జంక్షన్ హరిహరమార్గ్, సీఆర్వో కార్యాలయం ఎదురుగా, ప్రకాష్‌సదన్ ఎదురుగా, ఈవో కార్యాలయ సమీపంలో స్థలం కేటాయించామని, సుమారు వెయ్యి నాలుగుచక్రాల వాహనాలకు పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు

కొవ్వూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రూరల్ పోలీస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల రోజులపాటు శిక్షణ పొందనున్నట్టు ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా 9494653507 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో అమ్మవార్ల ఊరేగింపు



అమ్మవారిని ప్రత్యేక రథంలో ఊరేగిస్తున్న దృశ్యం

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లోని సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారిని, పల్లపువీధి రామాలయంలోని కనక దుర్గ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో బుధవారం ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం రూ. ఆరు వేల ఆర్థిక సహాయం

తాళ్లపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో బుధవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యం కోసం ఆరు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించామని సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్న నూనె లక్ష్మి అనే మహిళకు వైద్యకోసం ఆర్థిక సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో ఇంజరపు వెంకట సత్యనారాయణ (అబ్బు), సనపల రాజశేఖర్, బారణాల శంకర్, గెడ్డం సాయిబాబా, గన్నిన సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు సన్మానం

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనోసంకల్పం, ఏకాగ్రత ఉంటే వయస్సుతో సంబంధం లేకుండా అనుకున్న లక్ష్యాలు సాధిం చవచ్చని ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించిన వానపల్లి సత్యనారాయణ చూపించారని మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ ఇమ్మడి రాజేశ్వరి అన్నారు. దేవరపల్లికి చెందిన సత్యనారాయణ 73 సంవత్సరాల వయసులో ఎవరూ చేయడానికి సాధ్యపడని అబ్రోల్లర్‌ని చేయడమే కాకుండా, దీనిలో ఒకే సంవత్సరంలో మూడుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధిం చారు. గోపాలపురం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి, కొయ్యలగూడెం జూనియర్ కాలేజీలో 50 ఏళ్ల క్రితం చదివిన పూర్వ విద్యార్థులు బుచ్చయ్యపాలెం మల్లిపూడి జయకృష్ణమోహన్ దంపతుల ఆధ్వర్యంలో ఎంజేకే ఫామ్‌హౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అయిన సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాయల ప్రభాకర్, కలవపూడి చిన్నబ్బాయి, సికిందర్, విద్యాసాగర్, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ...

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, అక్టోబరు 8 (ఆం ధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉండ్రాజవరంలో ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగా అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏవో బీ. రాజారావు మాట్లాడుతూ వర్షాలకు తట్టుకునేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలను భద్రపరిచేందుకు టార్పాలిన్లు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ శ్రీనివాసరావు, కొవ్వూరు డివిజన్ సహకార అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో జీ. శ్రీనివాస్, రైస్ మిల్లర్లు, సొసైటీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.